PRGI Reg No -"APTEL/26/A1193

# నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక

చదవండి..... చదివించండి.....

శుభోదయ

ప్రతిక్షణం... ప్రజల కోసం...

www.netishubhodaya.com

96965 71571

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, సంపుటి 01, సంచిక 207, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -8, గురువారం - 17 - సెప్టెంబర్ - 2026 , వెల రూ.5/-

## కోర్టులో ట్రంప్ కు ఎదురుదెబ్బ..
## విదేశీ విద్యార్థులు, జర్నలిస్టులకు ఊరట

- భారత్ సహా పలు దేశాల నుంచి అమెరికాలో చదువుకుంటున్న అంతర్జాతీయ విద్యార్థులకు ఊరట లభించింది.
- దాదాపు 600 ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు ప్రాతినిధ్యం వహిస్తున్న సంస్థలు న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి.



వాషింగ్టన్: విదేశీ విద్యార్థులు, జర్నలిస్టుల వీసాల కాలపరిమితిపై ట్రంప్ ప్రభుత్వం తీసుకొచ్చిన కఠిన నిబంధనలను అమెరికా ఫెడరల్ కోర్టు తాత్కాలికంగా నిలిపివేసింది. మంగళవారం నుంచి ఈ నిబంధనలు అమల్లోకి రావాల్సి ఉండగా, ఒక్కరోజు ముందే మసాచుసెట్స్ జిల్లా న్యాయమూర్తి ఎఫ్. డెన్నిస్ ప్రాథమిక స్టే విధించారు. దీంతో భారత్ సహా పలు దేశాల నుంచి అమెరికాలో చదువుకుంటున్న అంతర్జాతీయ విద్యార్థులకు ఊరట లభించింది. కొత్త నిబంధనలు అమెరికాలో విదేశీ విద్యార్థులు, ఎక్స్ఛేంజ్ సందర్శకుల వీసాలను గరిష్ఠంగా నాలుగేళ్లకు, జర్నలిస్టుల వీసాలను 240 రోజులకు పరిమితం చేయాలని ప్రతిపాదించాయి. చైనా జర్నలిస్టులకు మాత్రం 90 రోజుల పరిమితి విధించారు. గడువు పొడిగింపునకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉన్నప్పటికీ.. దానిని ఆమోదించే అధికారం హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం అధికారుల విచక్షణకు వదిలారు. మిగతా..2లో

### మాజీ ప్రధాని షేక్ హసీనా సన్నిహితులు ఏడుగురికి మరణశిక్ష.. ఖరారు చేసిన బంగ్లాదేశ్ కోర్టు



- మానవత్వానికి వ్యతిరేకంగా నిందితులు వ్యవహరించారని జస్టిస్ మొహమ్మద్ నజ్రుల్ ఇస్లాం చౌదరి తీర్పు వెల్లడించారు.
- మాజీ ప్రధాని షేక్ హసీనాపై గత ఏడాదే ఇదే అంశంలో అక్కడి కోర్టు మరణశిక్ష విధించింది. ఇప్పుడు ఆమె అనుచరులకు శిక్ష పడింది.

ఢిల్లీ : బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆమె సన్నిహితులు ఏడుగురికి బంగ్లాదేశ్‌కు మిగతా..2లో

## యూపీఐ చార్జీలు.. యూఎస్ ఒత్తిడికి
## కేంద్రం లొంగిందన్న రాహుల్ గాంధీ

- అమెరికా ప్రభుత్వ ఒత్తిడికి కేంద్ర ప్రభుత్వం లొంగిపోయిందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తాజాగా ఆరోపించారు.
- యూపీఐ చార్జీలు విధించే దిశగా చడీచప్పుడూ లేకుండా మార్గం సిద్ధం చేసిందని మండిపడ్డారు.
- యూపీఐ చార్జీలు.. యూఎస్ ఒత్తిడికి కేంద్రం లొంగిందన్న రాహుల్ గాంధీ



ఇంటర్నెట్ డెస్క్: అమెరికా ప్రభుత్వ ఒత్తిడికి కేంద్ర ప్రభుత్వం లొంగిపోయిందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తాజాగా ఆరోపించారు. యూపీఐ చార్జీలు విధించే దిశగా చడీచప్పుడూ లేకుండా మార్గం సిద్ధం చేసిందని మండిపడ్డారు. రూ.2 వేల లోపు యూపీఐ లావాదేవీలపై బ్యాంకులు, పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్లు చార్జీలు విధించవద్దంటూ కేంద్రం నోటిఫికేషన్ జారీ చేయడంతో రాహుల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తాజా నోటిఫికేషన్ పలు సందేహాలను లేవనెత్తుతోందని రాహుల్ గాంధీ అన్నారు. ఇది చివరకు అధిక మొత్తాల మిగతా..2లో

## కొండా సురేఖ బర్తరఫ్ బాధాకరమే..





2

- పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘనతోనే ఏఐసీసీ చర్య తీసుకుందని వెల్లడి
- పార్టీ హద్దులు దాటితే ఎవరిపైనైనా చర్యలు తప్పవని స్పష్టీకరణ
- సీఎం రేవంత్‌రెడ్డితో తనకు ఎలాంటి విభేదాలు లేవని వ్యాఖ్య
- ప్రభుత్వం, పార్టీని సమన్వయంతో ముందుకు తీసుకెళ్తున్నామని వెల్లడి
- పార్టీ సమస్యలను అంతర్గత వేదికల్లోనే చర్చించాలని సూచన

హైదరాబాద్ : కొండా సురేఖను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయడం బాధాకరమేనని టీపీసీసీ అధ్యక్షుడు

# అసెంబ్లీలో 22పై చర్చ..
# రెవెన్యూ శాఖపై సీఎం సమీక్ష

- రెవెన్యూ శాఖపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్షించారు.
- మంగళవారం జూబ్లీహిల్స్‌లోని వీలో ఉన్నతాధికారులతో ఆయన సమీక్షించారు.
- 22పై చర్చ - బుధవారం అసెంబ్లీలో 22 పై చర్చించాల్సిన అంశాలపై సీఎం రేవంత్ సమీక్షించారు.



హైదరాబాద్, సెప్టెంబర్ 15: రెవెన్యూ శాఖపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్షించారు. మంగళవారం జూబ్లీహిల్స్‌లోని ఉన్నతాధికారులతో ఆయన సమీక్షించారు. 22ఏపై చర్చ - బుధవారం అసెంబ్లీలో 22ఏ పై చర్చించాల్సిన అంశాలపై సీఎం రేవంత్ సమీక్షించారు. ఈ సందర్భంగా 22ఏ జాబితాపై సీఎం రేవంత్‌కు రెవెన్యూ శాఖ అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ సమీక్షలో డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, వివేక్, సీఎస్ సంజయ్ జాజుతోపాటు రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సమీక్ష సీఎం రేవంత్ రెడ్డితో మంత్రులు ఉత్తమ్, పొంగులేటి, శ్రీధర్ బాబు, వివేక్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బుధవారం అసెంబ్లీలో 22ఏ, ఎల్ నినోపై చర్చ సందర్భంగా అనుసరించాల్సిన వ్యూహం గురించి వారు చర్చించారు.

**లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలి: డిప్యూటీ సీఎం**

నవంబర్19 నుంచి మిగతా..2లో

## ఉద్యోగులతో పెట్టుకుంటున్నారు..
## కాంగ్రెస్ ఓటమి ఖాయం



- ఉద్యోగులతో విభేదించిన ప్రభుత్వాలు మళ్లీ అధికారంలోకి రాలేదని కవిత వ్యాఖ్య
- కాంగ్రెస్ ప్రభుత్వం ఓడిపోవడం ఖాయమని విమర్శలు
- ఉద్యోగులు, ఉపాధ్యాయులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపణ
- 630 మండలాలకు 8 మంది పర్మినెంట్ ఎంఈవోలే ఉన్నారని విమర్శ
- పీఆర్సీ, డీఏలపై ప్రభుత్వం స్పందించడం లేదని ఆరోపణ

హైదరాబాద్ : ఉద్యోగులు, ఉపాధ్యాయులతో పెట్టుకున్న ప్రభుత్వాలు మళ్లీ అధికారంలోకి వచ్చిన దాఖలాలు లేవని తెలంగాణ మిగతా..2లో

## తెలుగు రాష్ట్రాలకు కేంద్రం భారీ కానుక.. అదనంగా 5 లక్షల ఇళ్లు మంజూరు



- ఆంధ్రప్రదేశ్‌కు 3 లక్షల ఇళ్ల కేటాయింపు
- తెలంగాణకు 2 లక్షల ఇళ్లు
- ఇళ్లు లేని నిరుపేద కుటుంబాలకు ప్రయోజనం
- గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అర్హులకు ఇళ్ల నిర్మాణానికి అవకాశం
- త్వరలో జిల్లాల వారీగా లబ్ధిదారుల ఎంపిక

అమరావతి : ఇళ్లు లేని నిరుపేద కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) కింద తెలుగు రాష్ట్రాలకు అదనంగా మరో 5 లక్షల ఇళ్లను మంజూరు చేసింది. ఇప్పటికే కేటాయించిన ఇళ్లకు అదనంగా ఈ ఇళ్లను అందించనుంది. ఇందులో ఆంధ్రప్రదేశ్‌కు 3 లక్షలు, తెలంగాణకు 2 లక్షల ఇళ్లు కేటాయించింది. ఈ నిర్ణయంతో రెండు రాష్ట్రాల్లోని మిగతా..2లో

## 22ఏ భూముల సమస్య తీవ్ర రూపం దాల్చింది: రఘునందన్ రావు



- లక్షలాది మంది ప్రజలు రిజిస్ట్రేషన్లు కాక ఇబ్బంది పడుతున్నారన్న రఘునందన్ రావు
- అసెంబ్లీలో మంత్రి పొంగులేటి సమాధానం దాటవేశారని విమర్శ
- కాంగ్రెస్ ప్రభుత్వం బురద చల్లే రాజకీయాలు చేస్తోందని మండిపాటు

హైదరాబాద్ : తెలంగాణలో 22ఏ నిషేధిత జాబితా భూముల సమస్య తీవ్ర రూపం దాల్చిందని, దీనివల్ల లక్షలాది మంది సామాన్య ప్రజలు రిజిస్ట్రేషన్లు కాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన మిగతా..2లో

## ఆళ్ల నాని మృతి పట్ల
## జగన్ తీవ్ర దిగ్భ్రాంతి



2

- గుండెపోటుతో హఠాన్మరణం చెందిన ఆళ్ల నాని
- నాని మరణవార్త తనను కలచి వేసిందన్న జగన్
- ఆళ్ల నాని మృతి తీరని లోటు అన్న బొత్స సత్యనారాయణ

అమరావతి : మాజీ ఉప ముఖ్యమంత్రి, ఏలూరు మాజీ ఎమ్మెల్యే ఆళ్ల నాని (56) అకస్మాత్తుగా గుండెపోటుతో కన్నుమూయడంపై వైసీపీ అధినేత జగన్

# కోచింగ్ కేంద్రాలు రాజకీయ
# కుట్రలకు వేదిక కాకూడదు

- కోచింగ్ కేంద్రాల్లో నిబంధనల ఉల్లంఘనలను సహించబోమని సీఎం చంద్రబాబు అన్నారు.
- అభ్యర్థులను రాజకీయ ఆందోళనలకు వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.





అమరావతి : పోటీ పరీక్షల కోచింగ్ ముసుగులో రాజకీయ ఆటలు సాగితే కఠిన చర్యలు తప్పవని ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు. రాజకీయ ప్రేరేపిత ఆందోళనలకు కోచింగ్ కేంద్రాలు అడ్డాగా మారొద్దని సీఎం స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించే సంస్థలపై చట్టపరంగా కొరడా ఝుళిపించాలని అధికారులను ఆదేశించారు. ఈ వ్యవహారంపై సమీక్ష నిర్వహించిన సీఎం కోచింగ్ కేంద్రాల కార్యకలాపాలపై క్షేత్రస్థాయిలో నిఘా పెంచాలని స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులను మిగతా..2లో

## హోంవర్క్ సున్నా..
## ఆరోపణలు వంద..



- నిరుద్యోగుల అవకాశాలపై సాక్షి విషం చిమ్ముతోందని ఏపీ మంత్రి అచ్చెన్నాయుడు మండిపడ్డారు.
- ఐదేళ్లపాటు ఒక్క వెటర్నరీ డాక్టర్ పోస్టును కూడా వైసీపీ భర్తీ చేయలేదని విమర్శించారు.

అమరావతి, సెప్టెంబర్ 15: నిరుద్యోగుల అవకాశాలపై సాక్షి విషం చిమ్ముతోందని ఆంధ్రప్రదేశ్ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మండిపడ్డారు. ఐదేళ్లపాటు ఒక్క వెటర్నరీ డాక్టర్ పోస్టును కూడా వైసీపీ భర్తీ చేయలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం 160 వెటర్నరీ డాక్టర్ పోస్టుల భర్తీకి అనుమతిచ్చిందని వెల్లడించారు. ఉద్యోగాలు ఇస్తుంటే ఓర్వలేక.. తప్పుడు కథనాలతో అడ్డుకునే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. అభ్యర్థులు కోరిన విధానాన్నే మిగతా..2లో

## మొదటి పేజి తరువాయి

### తెలుగు రాష్ట్రాలకు కేంద్రం భారీ కానుక..

# అదనంగా 5 లక్షల ఇళ్లు మంజూరు

ఇళ్లు లేని పేద కుటుంబాలకు ప్రయోజనం కలగనుంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అర్హత ఉన్న కుటుంబాలు సొంతింటి నిర్మాణానికి కేంద్రం అందించే సాయాన్ని పొందే అవకాశం ఉంటుంది. ఇప్పటికే తెలుగు రాష్ట్రాలకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద భారీగా ఇళ్లను కేటాయించిన కేంద్రం.. తాజాగా మరో 5 లక్షల ఇళ్లకు ఆమోదం తెలిపింది. కొత్త కేటాయింపులతో మరింత మంది నిరుపేద కుటుంబాలకు సొంతింటి కల నెరవేరే అవకాశం ఉంది. త్వరలో జిల్లాల వారీగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ప్రారంభం కానుంది. అర్హతలు, ఎంపిక విధానం, లబ్ధిదారుల జాబితాకు సంబంధించిన వివరాలను సంబంధిత అధికారులు వెల్లడించనున్నారు. అర్హత ఉన్న కుటుంబాలు ప్రభుత్వ ప్రకటనలపై దృష్టి పెట్టాలని అధికారులు సూచిస్తున్నారు.

# ఆళ్ల నాని మృతి పట్ల జగన్ తీవ్ర దిగ్భ్రాంతి

తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విశాఖపట్నంలోని తన నివాసంలో ఆళ్ల నాని హఠాన్మరణం చెందారన్న వార్త తనను తీవ్రంగా కలచివేసిందని ఆయన తెలిపారు. నాని కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కష్టసమయంలో వారికి మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు. ఆళ్ల నాని ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. శాసనమండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ... ఆళ్ల నాని మరణవార్త విని తాను శోకసముద్రంలో మునిగిపోయానని, ఆయన మృతి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ మంత్రులు కన్నబాబు, వెల్లంపల్లి శ్రీనివాసరావు ఆళ్ల నాని కుటుంబ సభ్యులకు తమ సానుభూతిని ప్రకటిస్తూ ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుకున్నారు. వైసీపీ విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు కేకే రాజు ఆళ్ల నాని భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విశాఖపట్నంలో గుండెపోటుకు గురైన ఆళ్ల నానిని ఆసుపత్రికి తరలించేలోపే ప్రాణాలు విడిచారు. ఏలూరు నియోజకవర్గం నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆయన, గత వైసీపీ ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా, వైద్యారోగ్య శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించిన సంగతి తెలిసిందే.

## అసెంబ్లీలో 22పై చర్చ.. రెవెన్యూ శాఖపై సీఎం సమీక్ష

'రాజీవ్ యువ వికాసం' తొలి విడత సాయం అందిస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. మంగళవారం ప్రజాభవన్‌లో ఎస్సీ, ఎస్టీ సంక్షేమంపై ఆయన సమీక్షించారు. రూ. లక్ష లోపు స్వయం ఉపాధి యూనిట్లకు తొలి విడత ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు చెప్పారు. లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం అధికారులను ఆదేశించారు. ఎస్సీ గురుకులాల్లో కేంద్రీకృత యంత్రాలతో వంటశాలలు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. మెకనైజ్డ్ కిచెన్ల ఏర్పాటుకు రూ. 25 కోట్ల నిధుల విడుదల చేస్తున్నట్లు చెప్పారు. 15 రోజుల్లో కేంద్రీకృత వంటశాలలపై కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులకు ఆయన స్పష్టం చేశారు. ఎస్సీ గురుకులాల పూర్వ విద్యార్థుల సమగ్ర డేటాబేస్ రూపొందించాలని సూచించారు. పూర్వ విద్యార్థుల స్థితిగతులపై సీఈఎస్ఎస్‌తో సమగ్ర అధ్యయనం చేపట్టాలని తెలిపారు. స్టడీ సర్కిళ్ల పనితీరుపై వివరణాత్మక నివేదిక ఇవ్వాలని తెలిపారు. ఎస్సీ డిగ్రీ కళాశాలల్లో పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కొత్త కోర్సులు ప్రవేశపెట్టాలని పేర్కొన్నారు. 26 ఏకలవ్య పాఠశాలల నిర్మాణ ప్రతిపాదనలు కేంద్రానికి పంపినట్లు ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కకు అధికారులు వివరించారు. ఈ సమీక్షకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్, సంక్షేమ శాఖ అధికారులు హాజరయ్యారు.

# కొండా సురేఖ బర్తరఫ్ బాధాకరమే..

మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. అయితే పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించినందుకే ఏఐసీసీ ఈ నిర్ణయం తీసుకుందని స్పష్టం చేశారు. పార్టీ నిర్దేశించిన హద్దులు దాటితే ఎంతటివారిపైనైనా చర్యలు తప్పవని తేల్చిచెప్పారు. హైదరాబాద్‌లో మంగళవారం మీడియాతో చిట్‌చాట్ సందర్భంగా మహేశ్‌కుమార్ గౌడ్ పార్టీ అంతర్గత వ్యవహారాలు, ఇటీవలి పరిణామాలపై మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, తనకు మధ్య ఎలాంటి విభేదాలు లేవని స్పష్టం చేశారు. ప్రభుత్వాన్ని, పార్టీని సమన్వయంతో ముందుకు తీసుకెళుతున్నామని తెలిపారు. "పార్టీ క్రమశిక్షణే అత్యంత ప్రధానం. ఏఐసీసీ నిర్దేశించిన హద్దులు, పార్టీ లైన్ దాటితే చర్యలు తప్పవు" అని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. పార్టీలో ఏమైనా సమస్యలు ఉంటే అంతర్గత వేదికలపై చర్చించుకోవాలని సూచించారు. విషయాలను బహిరంగంగా మాట్లాడి క్రమశిక్షణ ఉల్లంఘిస్తే అధిష్ఠానం ఉపేక్షించదని స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డితో కలిసి ప్రజా సంక్షేమం విస్తరణ, తెలంగాణలో కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయడమే తమ లక్ష్యమని మహేశ్‌కుమార్ గౌడ్ చెప్పారు. తమ మధ్య గ్యాప్ ఉందంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఎవరూ నమ్మొద్దని కోరారు. కాంగ్రెస్ కార్యకర్తల కష్టంతోనే తెలంగాణలో పార్టీ అధికారంలోకి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. సాధారణ కార్యకర్తలకు సైతం పార్టీలో కీలక పదవులు దక్కుతున్నాయని చెప్పారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు. పార్టీ కోసం కష్టపడుతున్న ప్రతి ఒక్కరినీ గుర్తిస్తామని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. పార్టీ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని నేతలు, కార్యకర్తలు క్రమశిక్షణతో పనిచేయాలని సూచించారు.

### కోర్టులో ట్రంప్ కు ఎదురుదెబ్బ..

# విదేశీ విద్యార్థులు, జర్నలిస్టులకు ఊరట

తిరస్కరణపై అప్పీల్‌కు అవకాశం లేకపోవడం కూడా నిబంధనల్లో ఉంది. ఈ విధానం అమెరికా ఆర్థిక వ్యవస్థ, ఉన్నత విద్యా రంగానికి విపత్తు స్థాయి నష్టం కలిగించే అవకాశం ఉందని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. దాదాపు 600 ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు ప్రాతినిధ్యం వహిస్తున్న సంస్థలు న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. ఉపశమనాన్ని కేవలం పిటిషనర్లకే పరిమితం చేయాలన్న ప్రభుత్వ వాదనను కూడా న్యాయమూర్తి తిరస్కరించారు. వీసా మోసాలను అరికట్టడం, గడువు ముగిసిన తర్వాత కూడా అమెరికాలో ఉండిపోయేవారిని గుర్తించడం సులభతరం చేయడమే కొత్త పరిమితుల ఉద్దేశమని ప్రభుత్వం వాదించింది. అయితే ప్రభుత్వాన్ని విమర్శించే విదేశీ జర్నలిస్టుల వీసా పునరుద్ధరణను అధికారులు నిరాకరించే స్పష్టమైన అవకాశముంది అని న్యాయమూర్తి ఆందోళన వ్యక్తం చేశారు. కొత్త నిబంధనల అసలు ఉద్దేశం జాతీయ భద్రత కంటే విద్యాసంస్థలు, మీడియాపై ప్రభుత్వ నియంత్రణ పెంచడమేనా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయని తీర్పులో పేర్కొన్నారు.

## మాజీ ప్రధాని షేక్ హసీనా సన్నిహితులు

## ఏడుగురికి మరణశిక్ష.. ఖరారు చేసిన బంగ్లాదేశ్ కోర్టు

చెందిన ఒక కోర్టు మరణశిక్ష విధించింది. 2024లో జరిగిన అల్లర్ల సందర్భంగా ఏడుగురిని నిందితులుగా పరిగణిస్తూ బంగ్లాదేశ్‌కు చెందిన ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రిబ్యునల్-2 ఈ మరణశిక్ష ఖరారు చేసింది. మానవత్వానికి వ్యతిరేకంగా నిందితులు వ్యవహరించారని జస్టిస్ మొహమ్మద్ నజ్రుల్ ఇస్లాం చౌదరి తీర్పు వెల్లడించారు. 2024లో బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా ఆధ్వర్యంలోని అవామీ లీగ్ ప్రభుత్వంపై ఆందోళనకారులు తిరగబడ్డ సంగతి తెలిసిందే. ఆందోళనల్ని అణచివేయడానికి ప్రభుత్వం కఠినంగా వ్యవహరించింది. ఈ సందర్భంగా ప్రభుత్వం అమానవీయంగా వ్యవహరించిందని అక్కడి ప్రతిపక్షాలు, ఆందోళనకారులు అంటున్నారు. ముఖ్యంగా ఏడుగురు నిందితులు సమావేశమై, ఆందోళనల్ని అణచి వేసేందుకు కుట్రలు చేశారని, హింసకు పాల్పడ్డారని వారిపై అభియోగాలు నమోదయ్యాయి. దీనిపై విచారణ జరిపిన కోర్టు ఏడుగురు నిందితులకు మంగళవారం మరణశిక్ష విధించింది. మాజీ ప్రధాని షేక్ హసీనాపై గత ఏడాదే ఇదే అంశంలో అక్కడి కోర్టు మరణశిక్ష విధించింది. ఇప్పుడు ఆమె అనుచరులకు శిక్ష పడింది. తాజాగా శిక్షకు గురైన వారిలో అవామీ లీగ్ పార్టీ ప్రధాన కార్యదర్శి, బంగ్లాదేశ్ మాజీ మంత్రి ఒబైదుల్ ఖాదర్, జాయింట్ సెక్రటరీ బహావుద్దీన్ నసీమ్, మాజీ సమాచార మంత్రి అలీ అరాఫత్, జుబో లీగ్ చైర్మన్ షేక్ ఫాజిల్ షామ్స్ పరాష్, ఈ సంస్థ జనరల్ సెక్రటరీ మైనుల్ హొసైన్ ఖాన్ నిఖిల్, బంగ్లాదేశ్ ఛాత్రా లీగ్ ప్రెసిడెంట్ సద్దాం హొసైన్, జనరల్ సెక్రటరీ షేక్ వాలి అసిఫ్ ఉన్నారు.

## 22ఏ భూముల సమస్య

# తీవ్ర రూపం దాల్చింది: రఘునందన్ రావు



విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో 22ఏ భూములపై స్పష్టమైన చారిత్రాత్మక నిర్ణయం వస్తుందని ఆశించిన ప్రజలకు నిరాశే మిగిలిందని రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఈ అంశంపై రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కనీస సన్నాహాలు లేకుండా సభకు వచ్చి అరకొర సమాచారంతో సమాధానం దాటవేసే ప్రయత్నం చేశారని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో కోటి ఎకరాలకు పైగా భూములను అడ్డగోలుగా 22ఏ జాబితాలో చేర్చిన అధికారులపై ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. మంత్రి ప్రతిపాదిస్తున్నట్లు, ఇప్పటివరకు తొలగించామంటున్న 47,440 ఎకరాల వివరాలు ఏ గ్రామంలో ఎక్కడున్నాయో బహిర్గతం చేయాలని, మిగిలిన భూములపై తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ హైకోర్టు సిట్టింగ్ జడ్జితో కూడిన ప్రత్యేక కమిటీని నియమించి ధరణి, భూభారతి లొసుగుల వల్ల నష్టపోయిన పేదలకు న్యాయం చేయాలని రఘునందన్ రావు కోరారు. ప్రజా సమస్యలపై నిలదీస్తే బీజేపీ, బీఆర్ఎస్ ఒకటేనంటూ రేవంత్ సర్కార్ బురదజల్లే రాజకీయాలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే మొదటి కేబినెట్ సమావేశంలోనే భూ సమస్యలకు పరిష్కారం చూపుతామని ఎంపీ స్పష్టం చేశారు.

# కోచింగ్ కేంద్రాలు రాజకీయ కుట్రలకు వేదిక కాకూడదు

## మొదటి పేజి తరువాయి

కొన్ని ప్రైవేటు కోచింగ్ సంస్థలు తమ స్వార్థ ప్రయోజనాలకు ఉపయోగించుకుంటున్నట్టు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. అభ్యర్థులపై ఒత్తిడి తీసుకొచ్చి ఆందోళనలు, నిరసనల్లో పాల్గొనేలా ప్రోత్సహిస్తున్న వ్యవహారంపై అధికారులు సీఎంకు వివరించారు. పరీక్షల కోసం శిక్షణ పొందాల్సిన యువతను రాజకీయ కార్యక్రమాల్లోకి లాగడం ఏమాత్రం సమర్థనీయం కాదని ప్రభుత్వం స్పష్టం చేసింది. నిర్దేశిత మార్గదర్శకాలను పాటించాలి: ఆంధ్రప్రదేశ్ కోచింగ్ సంస్థల నియంత్రణా నిబంధనలు2026 ప్రకారం ప్రైవేటు కోచింగ్ కేంద్రాలు తప్పనిసరిగా నిర్దేశిత మార్గదర్శకాలను పాటించాలని సీఎం స్పష్టం చేశారు. ముఖ్యంగా జీవో నెంబరు 9లోని నిబంధనలకు అనుగుణంగానే సంస్థల నిర్వహణ ఉండాలన్నారు. మార్గదర్శకాలను ఉల్లంఘించినట్టు తేలితే సంబంధిత కోచింగ్ సంస్థలపై చట్టపరమైన



చర్యలు తీసుకోవాలని సీఎం అధికారులను ఆదేశించారు. నిబంధనల అమలు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పకడ్బందీగా జరగాలని సీఎం ఆదేశించారు. ప్రైవేటు కోచింగ్ కేంద్రాల కార్యకలాపాలను అధికారులు పరిశీలిస్తూ మార్గదర్శకాలకు అనుగుణంగా నడుస్తున్నాయో లేదో తనిఖీ చేయాలన్నారు నిబంధనల ఉల్లంఘన, అభ్యర్థులపై అనుచిత ఒత్తిడి వంటి అంశాలు బయటపడితే తక్షణమే చర్యలకు ఉపక్రమించాలని సూచించారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు ఎలాంటి ఒత్తిళ్లకు లోనుకావద్దని ప్రభుత్వం సూచించింది. తమ కెరీర్, పరీక్షల సన్నద్ధతపైనే పూర్తి దృష్టి పెట్టాలని స్పష్టం చేసింది. కోచింగ్ సంస్థల నుంచి ఏదైనా ఒత్తిడి, ఇబ్బంది లేదా అనుచిత ప్రేరేపణ ఎదురైతే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించింది. కోచింగ్ కేంద్రాల ప్రధాన ఉద్దేశం పోటీ పరీక్షలకు అభ్యర్థులను సమర్థవంతంగా సిద్ధం చేయడమేనని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఆ లక్ష్యాన్ని పక్కనబెట్టి సంస్థల యజమానులు తమ వ్యక్తిగత లేదా ఇతర ప్రయోజనాల కోసం అభ్యర్థులను వినియోగిస్తే ఉపేక్షించబోమని హెచ్చరించింది. రాజకీయ కుట్రలు, ఆందోళనలు, నిరసనలకు విద్యార్థులను వాడుకునే ప్రయత్నాలపై చట్టం తన పని తాను చేస్తుందని స్పష్టం చేసింది.

# హోంవర్క్ సున్నా.. ఆరోపణలు వంద.. ఇదే ఆ ఛానల్ పరిస్థితి

## మొదటి పేజి తరువాయి

అమలు చేస్తే అక్రమమా? అని ప్రశ్నించారు. ఎనిమిదేళ్లుగా నియామకాలు జరగలేదని నిరుద్యోగుల సంఘం విజ్ఞప్తి చేసిందని తెలిపారు. ఈ ఒక్కసారికి పాత వెయిటేజీ విధానంలో నియామకాలు చేపట్టాలని నిర్ణయించినట్లు మంత్రి చెప్పారు. 52 ప్రకారం మెరిట్, వెయిటేజీ ఆధారంగా నియామక విధానం ఉందన్నారు. దీఎస్ఎి మార్కులకు 60, వీఎస్ఎికు 10, కాంట్రాక్ట్ సేవలకు 10 మార్కుల వెయిటేజీ కేటాయించినట్లు తెలిపారు. అలాగే సీనియారిటీకి ప్రతి ఏడాదికి 4 మార్కుల చొప్పున వెయిటేజీ ఇవ్వనున్నట్లు చెప్పారు. గరిష్ఠంగా 20 మార్కుల వెయిటేజీ పొందే అవకాశం ఉంటుందన్నారు. తొలుత ఏపీపీఎస్సీ ద్వారా పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి వెల్లడించారు. ఇూరాజకి ప్రస్తుత పని ఒత్తిడి కారణంగా వెయిటేజీ విధానంలో నియామకాలు చేపట్టడం సాధ్యం కాదన్నారు. ద్వారా ఈ ఒక్కసారికి పశుసంవర్ధక శాఖ ద్వారా నియామకాలు చేపట్టనున్నట్లు తెలిపారు. భవిష్యత్ నియామకాలు పరీక్షా విధానంలోనే ఉంటాయని స్పష్టం చేశారు. సాక్షిలో చెప్పినట్టు ప్రస్తుతం డైరెక్టర్‌గా దామోదర్ నాయుడు లేరని అచ్చెన్నాయుడు చెప్పారు. ఒక మహిళా అధికారి ఇన్‌ఛార్జి డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారని వెల్లడించారు. కనీసం డైరెక్టర్ ఎవరో తెలుసుకోకుండా కథనం రాస్తారా? అంటూ మండిపడ్డారు. 'హోంవర్క్ సున్నా.. ఆరోపణలు వంద.. ఇదే సాక్షి పరిస్థితి' అని విమర్శించారు. ఉద్యోగాలు ఇవ్వడం తమ విధానమని.. ఉద్యోగాలకు అడ్డుపడటం వైసీపీ విధానమని వ్యాఖ్యానించారు. నిరుద్యోగుల భవిష్యత్తుతో



రాజకీయాలు చేయొద్దని వైసీపీకి హితవు పలికారు. యువతకు న్యాయం చేసే విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

# యూపీఐ చార్జీలు.. యూఎస్ ఒత్తిడికి కేంద్రం లొంగిందన్న రాహుల్ గాంధీ

## మొదటి పేజి తరువాయి



యూపీఐ లావాదేవీలపై చార్జీల వద్దనకు దారి తీయవచ్చని అన్నారు. డొనాల్డ్ ట్రంప్‌ను సంతోషపెట్టేందుకు అమెరికా సంస్థలకు కేంద్రం ఈ చర్యతో స్వాగతం పలుకుతోందా? అని ప్రశ్నించారు. ' మర్చెంట్ యూపీఐ చెల్లింపులపై ఎమ్‌డీఆర్‌ను ఇకపై విధించే అవకాశం ఉంది. మొత్తం యూపీఐ లావాదేవీల్లో సంఖ్యా పరంగా వీటి (రూ.2 వేలకు పైబడి లావాదేవీలు) వాటా 5 శాతమే అయినప్పటికీ విలువ పరంగా మాత్రం 65 శాతం. వినియోగదారులపై చార్జీలు వద్దని ప్రభుత్వం చెబుతోంది. మరి ఈ లావాదేవీలపై షాపుల వారు చెల్లించే డబ్బులు ఎక్కడి నుంచి వస్తాయి?' అని అన్నారు. యూపీఐ లావాదేవీలపై ఎమ్‌డీఆర్ చార్జీలు విధించకపోవడాన్ని అమెరికన్ కంపెనీలు ఎప్పటి నుంచే వ్యతిరేకిస్తున్నాయని రాహుల్ గాంధీ చెప్పారు. ఈ ఒత్తిడికి తలొగ్గి ఎమ్‌డీఆర్ చార్జీలు విధించేందుకు కేంద్రం కొత్త మార్గం సిద్ధం చేసిందని ఆరోపించారు. 'యూఎస్ డీల్ వలెనే ప్రధాని మోదీ మరోసారి రాజీ పడ్డారు. అమెరికా ఒత్తిడికి లొంగారు' అని అన్నారు. తాము గతంలో హెచ్చరించినట్టుగానే జరిగిందని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ అన్నారు. పేమెంట్స్ అండ్ సెటిల్‌మెంట్స్ సిస్టమ్స్ యాక్ట్ - 2007కు చేసిన సవరణలను పేర్కొన్నారు. రూ.2 వేల పైచిలుకు విలువలగల యూపీఐ లావాదేవీలపై చార్జీలు విధించకుండా స్పష్టమైన రక్షణ ఏదీ కల్పించలేదని చెప్పారు. ఇది చార్జీల విధింపునకు వేదికను సిద్ధం చేయడమేనని వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో ఈ రూ.2 వేల పరిమితికి కూడా మార్పులు రావొచ్చని హెచ్చరించారు.

### ఎమ్‌డీఆర్ అంటే..

క్రెడిట్, డెబిట్ కార్డు లావాదేవీల ప్రాసెసింగ్ కోసం షాపుల వారు చెల్లించే ఫీజును మర్చెంట్ డిస్కౌంట్ రేట్ (ఎమ్‌డీఆర్) అని అంటారు. ఎలక్ట్రానిక్ చెల్లింపులకు సంబంధించిన ఉపకరణాలు, నెట్‌వర్క్ మెయింటెనెన్స్, భద్రత కల్పించినందుకు ఈ ఫీజులు విధిస్తారు. వాణిజ్య సంస్థలు చెల్లించే ఈ చార్జీలను బ్యాంకులు, పేమెంట్ నెట్‌వర్క్‌లు (వీసా, మాస్టర్ కార్డు) తీసుకుంటాయి. ప్రస్తుతం భారత్‌లో క్రెడిట్, డెబిట్ కార్డుల చెల్లింపులపై ఎమ్‌డీఆర్ చార్జీలను విధిస్తున్నారు. ఇవి ఆయా వాణిజ్య సంస్థలే చెల్లిస్తున్నాయి. రూపే డెబిట్ కార్డు ఎమ్‌డీఆర్ చార్జీలకు సంబంధించి ప్రభుత్వం సబ్సిడీ చెల్లిస్తోంది. అయితే, యూపీఐ సేవలపై మాత్రం ప్రస్తుతం ఎలాంటి చార్జీలు లేవు. డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

# ఉద్యోగులతో పెట్టుకుంటున్నారు.. కాంగ్రెస్ ఓటమి

## మొదటి పేజి తరువాయి

రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలపై హైదరాబాద్ బాగ్ లింగంపల్లిలో మంగళవారం నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులను కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. వారిని చిన్నచూపు చూస్తూ నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. ఈసారి ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఓడిపోవడం ఖాయమని వ్యాఖ్యానించారు. తాము అధికారంలోకి వస్తే ప్రభుత్వ ఉద్యోగులను రాష్ట్ర అభివృద్ధిలో కీలక భాగస్వాములుగా చూస్తామని కవిత చెప్పారు. ఉద్యోగులను గౌరవించేలా, వారు సంతోషంగా పనిచేసేలా తమ ప్రభుత్వం విధానాలు రూపొందిస్తుందని తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఉపాధ్యాయులు ఉద్యోగం



కన్నా ఉద్యమానికే ప్రాధాన్యం ఇచ్చి పోరాడారని కవిత గుర్తు చేశారు. రాష్ట్రంలో 630 మండలాలకు కేవలం ఎనిమిది మంది పర్మినెంట్ మండల విద్యాధికారులు (ఎంఈవోలు) ఉండటం విద్యా వ్యవస్థపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. ఉచిత, నాణ్యమైన విద్య అందాలంటే బలమైన యంత్రాంగం అవసరమని అన్నారు. విద్యార్థుల వివరాలు, రిపోర్టుల పేరుతో ఉపాధ్యాయులను బోధనకు దూరం చేస్తున్నారని ఆరోపించారు. ఒక్క ఉపాధ్యాయుడితో నడుస్తున్న పాఠశాలల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉందన్నారు. ఉద్యోగుల సహకారం లేకుండా ప్రభుత్వం ఏ కార్యక్రమాన్నీ సమర్థంగా అమలు చేయలేదని కవిత అన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు కూడా ఆశించిన స్థాయిలో లేదని విమర్శించారు. మైకుల ముందు ఎన్ని గొప్పలు చెప్పినా పెన్షన్లు, యూరియా, రైతులకు విద్యుత్ అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఎన్నికల ముందు పీఆర్సీ, డీఏలు ఇస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇప్పటివరకు వాటిపై స్పందించలేదని అన్నారు.

# ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాల ఫలితం

**5 ఏళ్లలో 24.20 లక్షల ప్రదేశాల్లో శుభ్రతా చర్యలు**

**- స్క్రాప్ విక్రయాల ద్వారా రూ.5,102.91 కోట్ల ఆదాయం**

ఢిల్లీ : ప్రభుత్వ కార్యాలయాల్లో పనికిరాకుండా సామగ్రిని తొలగించడం, ఖాళీ స్థలాలను వినియోగంలోకి తీసుకురావడం, పెండింగ్ పనులను తగ్గించడం లక్ష్యంగా కేంద్రం చేపడుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు మంచి ఫలితాలు ఇచ్చాయి. గత ఐదేళ్లలో ప్రభుత్వ కార్యాలయాల్లోని స్క్రాప్ ను విక్రయించడం ద్వారా కేంద్రానికి ఏకంగా రూ.5,102.91 కోట్ల ఆదాయం సమకూరినట్లు తెలిపింది. 2021 నుంచి ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను కేంద్రం వరుసగా నిర్వహిస్తోంది. ఇప్పటివరకు ఐదు వార్షిక విడతలతో పాటు, జులై 2026 వరకు ప్రతి నెలా నిర్వహించిన సెక్రటేరియట్ సంస్కరణల పర్యవేక్షణ కార్యక్రమాలను కలిపి 24.20 లక్షలకు పైగా ప్రదేశాల్లో చర్యలు చేపట్టారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అవసరం లేని పాత వస్తువులు, పనికిరాని సామగ్రి, స్క్రాప్‌ను గుర్తించి తొలగించడంతో పాటు, పాత రికార్డులు, ఫైళ్లను కూడా పరిశీలిస్తున్నారు. ఈ ప్రక్రియలో 180.48 లక్షలకు పైగా ఫైళ్లను తొలగించడం లేదా మూసివేయడం జరిగింది. దీంతో కార్యాలయాల్లో రికార్డుల నిర్వహణ సులభతరమవడంతో పాటు, వినియోగానికి పనికొచ్చే స్థలం అందుబాటులోకి వచ్చింది.

### ఐదో విడతలో రూ.833 కోట్లకు పైగా

ప్రత్యేక పారిశుద్ధ్య ప్రచారంలో ఐదో విడతలోనే గణనీయమైన ఫలితాలు సాధించినట్లు సిబ్బంది వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ దశలో 11.6 లక్షల ప్రదేశాలను పరిశీలించి శుభ్రతా చర్యలు చేపట్టారు. దాదాపు 29.52 లక్షల ఫైళ్లను తొలగించారు. పాత సామగ్రి, స్క్రాప్‌ను తొలగించడం ద్వారా ఏకంగా 233.75 లక్షల చదరపు అడుగుల కార్యాలయ స్థలం ఖాళీ అయింది. స్క్రాప్ విక్రయాల ద్వారా ఈ ఒక్క విడతలోనే సుమారు రూ.833.92 కోట్ల ఆదాయం వచ్చినట్లు సిబ్బంది మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

### ఆరో విడతకు రంగం సిద్ధం

ఇదే కార్యక్రమాన్ని మరింత విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు ఆరో విడతకు సిద్ధమవుతోంది. అక్టోబర్ 2 నుంచి 31 వరకు స్పెషల్ క్యాంపెయిన్ 6 నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్‌ను కేంద్ర సిబ్బంది వ్యవహారాల సహాయ మంత్రి జితేంద్ర సింగ్ బుధవారం ప్రారంభించనున్నారు. అయితే ప్రధాన ప్రచారానికి



ముందుగానే సెప్టెంబర్ 16 నుంచి 30 వరకు సన్నాహక దశను చేపట్టనున్నారు. ఈ సమయంలో వివిధ మంత్రిత్వ శాఖలు, ప్రభుత్వ విభాగాలు తమ కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్న అంశాలను గుర్తిస్తాయి.

### ముందుగానే కార్యాచరణ ప్రణాళిక

సన్నాహక దశలో కార్యాలయాల్లో పెండింగ్ పనులు రికార్డులు, అవసరం లేని సామగ్రిని వర్గీకరించనున్నారు. క్షేత్రస్థాయి సిబ్బందిని కార్యక్రమంలో భాగస్వాములను చేయడం, ప్రచారం నిర్వహించాల్సిన ప్రదేశాలను ఖరారు చేయడం, పాత రికార్డులను సమీక్షించడం వంటి చర్యలు చేపడతారు. అదేవిధంగా కార్యాలయాల్లో అందుబాటులో ఉన్న స్థలాన్ని మెరుగ్గా వినియోగించుకునేందుకు స్పేస్ మేనేజ్‌మెంట్ ప్రణాళిక రూపొందించనున్నారు. గుర్తించిన స్క్రాప్‌ను సకాలంలో తొలగించేందుకు చర్యలు తీసుకుంటారు.

### 84 మంత్రిత్వ శాఖలు, విభాగాల్లో సమీక్ష

క్యాంపెయిన్ -6లో భాగంగా కేంద్రంలోని మొత్తం 84 మంత్రిత్వ శాఖలు, విభాగాలకు చెందిన నోడల్ అధికారులు, ప్రజా ఫిర్యాదుల నోడల్ అధికారులు, అప్పీలేట్ అథారిటీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించనున్నారు. పరిపాలనా సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం (డీఏఆర్ పీజీ), తపాలా, బొగ్గు, గనులు, పాఠశాల విద్యఅక్షరాస్యత విభాగాల కార్యదర్శులు ఈ కార్యక్రమంలో అధికారులను ఉద్దేశించి మాట్లాడనున్నారు. ఆరో విడత ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం కేవలం దిల్లీలోని కేంద్ర కార్యాలయాలకే పరిమితం కాదు. అన్ని కేంద్ర మంత్రిత్వ శాఖలు, విభాగాలు, వాటి కార్యాలయాలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న అవుట్‌స్టేషన్ కార్యాలయాల్లోనూ అమలు చేయనున్నారు. విదేశాల్లోని భారత రాయబార కార్యాలయాలు, మిషన్లు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములు కానున్నాయి. క్యాంపెయిన్‌లో భాగంగా అమలు చేసిన వినూత్న విధానాలు, విజయవంతమైన నమూనాలను గుర్తించి ఇతర కార్యాలయాలకు అందుబాటులోకి తీసుకురానున్నారు. డిసెంబర్ 19 నుంచి 25 వరకు నిర్వహించనున్న గుడ్ గవర్నెన్స్ వీక్‌లో ఈ ఉత్తమ విధానాలను ప్రదర్శించనున్నారు.

## విధి ఒత్తిళ్ళ మధ్య, వినాయకుని చెంత

- ఖాకీ చేతులతో వడ్డింపు, సిబ్బందితో సహపంక్తి
- అధికారం పక్కనపెట్టి, ఆత్మీయత పంచారు
- విధుల్లో కఠినం, పండుగ వేళ ఆప్యాయం
- ఖాకీ బంధం, సహపంక్తి భోజనం
- పండుగ వేళ, పోలీస్‌స్టేషన్‌లో ఆత్మీయ విందు
- బాసులు కాదు, సహచరులుగా భోజనం



ఏలూరు, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ ::: విధి నిర్వహణలో కఠినంగా కనిపించే పోలీసులు, పండుగ వేళ ఆత్మీయతను చాటారు. వినాయక చవితి సందర్భంగా ఏలూరు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో వినాయక విగ్రహ ప్రతిష్ఠ, ప్రత్యేక పూజలతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ, ఎస్ఐలు సుధాకర్, నాగబాబు, ఏలూరు రూరల్ ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు స్వయంగా సిబ్బందికి భోజనాలు వడ్డించి, వారితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. దీంతో పోలీస్ సిబ్బంది మధ్య సోదరభావం, ఐక్యత మరింత బలపడింది. పండుగ వేళ అధికారులతో కలిసి ఆత్మీయంగా భోజనం చేయడం ఆనందంగా ఉందని సిబ్బంది పేర్కొన్నారు.

## రోకటి సుష్మకు అభినందనలు శెట్టి రంగారావు



ఖమ్మం, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ ::: జూలూరుపాడు మండలం పాపకొల్లు గ్రామానికి చెందిన మున్నూరు కాపు బిడ్డ రోకటి సుష్మకు ఎం బిబిఎస్ లో ఫ్రీ సీటు రావడం పట్ల అభినందనలు తెలియచేసిన మున్నూరు కాపు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, జిల్లా కాంగ్రెస్ నాయకులు శెట్టి రంగారావు దంపతులు. ఈ విషయం తెలుసుకొని వారి స్వగ్రామం పాపకొల్లు వెళ్ళి చదువుల తల్లి సుష్మకు శాలువాతో సత్కరించి సన్మానం చేసి అభినందనలు తెలియ చేయడం జరిగింది. వైద్య వృత్తి చాలా ఖరీదు ఐనది అటువంటిది తనకు ఫ్రీ సీటు రావడం చాలా గ్రేట్ అని కొనియాడారు. చాలా కష్టపడి ఇద్దరు ఆడపిల్లలను చదివించిన తల్లి తండ్రులు రోకటి ప్రమీల - రమేష్ లను కూడా ఈ సందర్భంగా అభినందించారు. ఈ అభినందన కార్యక్రమంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఎగుమతి శాఖ కార్యదర్శి బైరిశెట్టి శ్రీనివాసరావు,శెట్టి సత్యవతి, జి శ్రీదేవి, గోపిశెట్టి శ్రీనివాసరావు, రోకటి శ్రీనివాస్ రావు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## చింతూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓజోన్ దినోత్సవం




చింతూరు, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ ::: చింతూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కెమిస్ట్రీ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో ఓజోన్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు . ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ ఎన్.మణిమాల ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ జీవరాశికి రక్షణ కవచంగా ఉన్న ఓజోన్ పొరకు ఏర్పడిన రంధ్రం కారణంగా కలిగే నష్టాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. వైస్ ప్రిన్సిపల్ ముల్లి. శేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు పర్యావరణ పరిరక్షణలో తమ వంతు బాధ్యతగా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, చెట్లను పెంచడం పర్యావరణహిత జీవన విధానాలను పాటించటం వంటి చర్యలు చేపట్టాలని సూచించారు. రసాయనిక శాస్త్ర అధ్యాపకులు డా. శివకృష్ణ మాట్లాడుతూ ఓజోన్ పొర క్షీణించడం వల్ల గ్లోబల్ వార్మింగ్, చర్మవ్యాధులు, కంటి సమస్యలు, రోగ నిరోధక శక్తి తగ్గడం వంటి దుష్పరిణామాలు వస్తాయని తెలియజేశారు. జువాలజీ డిపార్ట్మెంట్ జి.సాయికుమార్ మాట్లాడుతూ వాతావరణంలో స్ట్రాటోస్ఫియర్ పొరలో ఉండే ఓజోన్ వాయువు సూర్యుని నుండి వచ్చే హానికరమైన అల్ట్రా వయోలెట్యు వి కిరణాల నుండి భూమిని ఎలా రక్షిస్తుందో వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వై. పద్మ, ఎం.రాకేష్ రాజ్, డా. ఝాన్సీ, బి. శ్రీనివాసరావు, ఆనంద్, కోట్ల. లక్ష్మీ ప్రసన్న, కే.కీర్తి, విద్యార్థినీ, విద్యార్థులు అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది హాజరయ్యారు.

# ఉద్యోగం కోరుకునే స్థాయి నుంచి ఉపాధి కల్పించే స్థాయికి యువత ఎదగాలి

**సీఎం చంద్రబాబు, ఐటీ మంత్రి నారా లోకేష్ ప్రత్యేక దృష్టితో రాష్ట్రానికి పెట్టుబడులు**

**- ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి**




నంద్యాల, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ ::: నా స్వస్థలమైన నంద్యాలలో, భవిష్యత్ భారతాన్ని తీర్చిదిద్దే యువతీ యువకుల మధ్య ఈ సదస్సును ప్రారంభించడం నాకెంతో సంతోషాన్ని ఇస్తోందని, ఒక రాష్ట్రంలోనైనా, దేశంలోనైనా శాశ్వత మార్పు రావాలంటే అది యువశక్తితోనే సాధ్యమని, అందుకే మా మంచి కూటమి ప్రభుత్వం యువత నైపుణ్యాభివృద్ధికి, ఉపాధి భద్రతకు పెద్దపీట వేస్తోందని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. బుధవారం నంద్యాల శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాలలో యువత భవిష్యత్ కు భరోసా అను సదస్సును ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ప్రారంభించారు. ఈ సందర్భంగా నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ నా స్వస్థలమైన నంద్యాలలో భవిష్యత్ భారతాన్ని తీర్చిదిద్దే యువతీ యువకుల మధ్య ఈ సదస్సు ప్రారంభించడం నాకు ఎంతో సంతోషాన్ని ఇస్తుంధోందని, రాష్ట్రంలో నైనా, దేశంలో నైనా శాశ్వత మార్పు రావాలంటే అది యువ శక్తి తోనే సాధ్యం అని, మా మంచి ఉమ్మడి ప్రభుత్వం యువత నైపుణ్యాభివృద్ధికి, ఉపాధి భద్రతకు పెద్ద పీఠ వేస్తోందని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. ఒకప్పుడు రాయలసీమ అనగానే తీవ్ర వర్షాభావం, రైతుల కష్టాలు, ఉపాధి లేక వలసలు గుర్తుకొచ్చేవి. కానీ నేడు పరిస్థితులు మారాయని. మన ప్రాంతం కరువుతో పోరాడే స్థితి నుంచి అభివృద్ధి వైపు పరుగులు తీస్తోందని. పరిశ్రమల రాకతో రాయలసీమ ముఖచిత్రం పూర్తిగా మారిపోతోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యా-ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ గ్లోబల్ ఇన్వెస్టర్లతో సంప్రదింపులు జరుపుతూ రాష్ట్రాన్ని పెట్టుబడుల కేంద్రంగా తీర్చిదిద్దుతున్నారు. రాష్ట్రానికి వస్తున్న భారీ పారిశ్రామిక పెట్టుబడుల ద్వారా స్థానిక యువతకు వేలాది ఉద్యోగావకాశాలు అందుబాటులోకి రానున్నాయనీ. రాజకీయాల్లో విలువలు, అభివృద్ధిలో పారదర్శకత ఉండాలని కోరుకునే నేటి తరం.. దేశ నిర్మాణంలోనూ బాధ్యతాయుతంగా భాగస్వామ్యం కావాలని. మీ ఓటు హక్కు ద్వారా సమాజ భవితవ్యాన్ని మార్చే నాయకత్వాన్ని ఎన్నుకోండని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి పిలుపు నిచ్చారు.

విద్యార్థులతో ముఖాముఖి, వ్యవస్థాపకతపై సందేశంప్రసంగం అనంతరం ఎంపీ విద్యార్థులతో నేరుగా సంభాషించారు. ఉన్నత విద్య, పోటీ పరీక్షలు, స్టార్టప్ ఆలోచనలు, ప్రాంతీయ పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలపై విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు ఆమె వివరణాత్మక సమాధానాలు ఇచ్చారు. ఈ సందర్భంగా స్థానిక యువ ఔత్సాహిక పారిశ్రామికవేత్త, 'మీతో' (మీతో) యాప్ వ్యవస్థాపకుడు న్యాస పవన్ కృషిని ప్రత్యేకంగా అభినందిస్తూ "ఉద్యోగం కోరుకునే స్థాయి నుంచి పలువురికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగడమే నిజమైన విజయం; విద్యార్థులు స్టార్టప్‌లు, ఆవిష్కరణల వైపు ముందడుగు వేయాలి" అని పిలుపునిచ్చారు.

### శ్రీ రామకృష్ణ విద్యా సంస్థల చైర్మన్ ప్రొఫెసర్ జి. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ

"శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన 'భవిష్యత్తుకు భరోసా' కార్యక్రమాన్ని మొట్టమొదటిగా నిర్వహించడం మాకెంతో గర్వకారణం. యువత ఆలోచనలే దేశ నిర్మాణానికి బలమైన పునాదులు. నేటి తరం విద్యార్థుల్లో అపారమైన ప్రతిభ, సరికొత్త దృక్పథం ఉన్నాయన్నారు. వారికి సరైన మార్గదర్శకత్వం, చేయూత లభిస్తే అద్భుతాలు సృష్టిస్తారని, మన నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బైరెడ్డి శబరి విద్యార్థులకు, ముఖ్యంగా యువతులకు గొప్ప స్ఫూర్తిప్రదాతగా నిలుస్తున్నారన్నారు. గతంతో పోలిస్తే విద్యా రంగంలో మౌలిక వసతులు, సాంకేతిక అవకాశాలు విప్లవాత్మకంగా మెరుగయ్యాయని. విద్యార్థులు ఈ వనరులను సద్వినియోగం చేసుకొని సమాజ హితం కోసం తమ వంతు కృషి చేయాలి. యువతలో ఆత్మవిశ్వాసాన్ని నింపే ఇలాంటి వేదికలను కల్పిస్తున్న ప్రభుత్వానికి మా హృదయపూర్వక కృతజ్ఞతలు. అన్నారు.

### కళాశాల డైరెక్టర్ డాక్టర్ జి. హేమంత్ రెడ్డి మాట్లాడుతూ



"ప్రపంచంలోనే అత్యధిక యువశక్తి కలిగిన దేశం భారతదేశం. మన దేశ అభివృద్ధి, ఆర్థిక పరిపుష్టి పూర్తిగా యువత తీసుకునే నిర్ణయాలు, చూపే చొరవపైనే ఆధారపడి ఉన్నాయని, రాబోయే తరాల గమనాన్ని, గమ్యాన్ని తిరగరాయగల శక్తి ఒక్క యువతరానికి మాత్రమే సొంతం అన్నారు. రాష్ట్రంలో ఎన్నో ప్రముఖ విద్యాసంస్థలు ఉన్నప్పటికీ, ఈ అవగాహన సదస్సును ప్రారంభించేందుకు మన కళాశాలకు ప్రాధాన్యతనిచ్చినందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నాను అన్నారు. విద్యార్థులు కేవలం పుస్తక పరిజ్ఞానానికే పరిమితం కాకుండా, సమస్యలను పరిష్కరించే నైపుణ్యాలను (ప్రాతీశీఎశ్రీవఎ-శీశ్రీజఱఅస్త్ర స్కిల్స్) అలవర్చుకోవాలి. నిరంతరం నేర్చుకునే తపనను అలవర్చుకున్నప్పుడే ప్రపంచ పోటీని తట్టుకొని నిలబడగలరన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ రామకృష్ణ పి జి కళాశాల డీన్ ఎ ఎస్ ప్రగతి, సెంట్రల్ ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్ నరహరి విశ్వనాధ్ రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

## వివాదరహిత నాయకుడు ఆళ్ల నానికి ఎంపీ పుట్టా మహేష్ కుమార్ నివాళి



ఏలూరు, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ ::: ఆళ్ల నాని అకాల మరణం ఆయన కుటుంబానికి మాత్రమే కాదు, ఏలూరు ప్రజలకు కూడా తీరని లోటు అన్నారు ఎంపీ పుట్టా మహేష్ కుమార్. బుధవారం మధ్యాహ్నం ఏలూరులోని ఆళ్ల నాని నివాసానికి చేరుకుని పార్థివ దేహంపై పూలమాల ఉంచి నివాళు లర్పించిన అనంతరం ఎంపీ పుట్టా మహేష్ కుమార్ మీడియాతో మాట్లాడారు. ఆళ్ల నాని ఏలూరు నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎమ్మెల్సీగా పనిచేశారనీ, ఉప ముఖ్యమంత్రి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా కూడా పనిచేసిన ఆళ్ల నాని వివాదరహితంగా పనిచేశారని కొనియాడారు. ఆళ్ల నాని తనతో ఎంతో స్నేహంగా ఉండేవారని చెబుతూ, ఇటీవల కూడా స్థానిక సంస్థల ఎన్నికల విషయంపై ఆళ్ల నానితో మాట్లాడటం జరిగిందని ఎంపీ గుర్తుచేసుకున్నారు. నిన్న మధ్యాహ్నం సమయంలో ఆళ్ల నాని గారు గుండెపోటుతో మృతి చెందారనే వార్త తెలిసి నమ్మలేకపోయానన్న ఎంపీ, ఆళ్ల నాని మృతి తనను ఎంతగానో బాధించిందన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఈ విషాద సమయంలో ఆ కుటుంబానికి భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని కోరుకుంటున్నానని, ఆళ్ల నాని ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నానని తెలిపారు.

## యాడికిలో ఆధ్యాత్మిక ఉత్సాహం నడుమ ఆర్యవైశ్య యువజన సంఘం వినాయక నిమజ్జనం

**: లడ్డూ ప్రసాదం రూ.20,116!**



యాడికి సెప్టెంబరు 16 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక : మండల కేంద్రంలో ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక చవితి వేడుకలు బుధవారం అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక శోభతో ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా బట్టు స్వామి ఆధ్వర్యంలో స్వామివారికి వేదమంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా 40 మంది ముత్తైదువులకు సాంప్రదాయబద్ధంగా ఒడిబియ్యం సమర్పించే కార్యక్రమాన్ని కన్నులపండువగా చేపట్టారు. అనంతరం స్వామివారిని కదిలించి నిమజ్జన ఘట్టానికి శ్రీకారం చుట్టారు. సంధ్యాసమయంలో స్వామివారి పూజా ద్రవ్యాలకు నిర్వహించిన బహిరంగ వేలం పాట భక్తుల ఉత్సాహం నడుమ రసవత్తరంగా సాగింది. తీవ్ర పోటీ నడుమ స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని పెండేకంటి పుల్లయ్య బ్రదర్స్ రూ. 20,116లకు దక్కించుకోగా, స్వామివారి వెండి బొడ్డుబిళ్లను కాసుల ప్రసాద్ దంపతులు రూ. 13,500లకు పాడుకున్నారు. వేలం పాట అనంతరం పోలీసు శాఖ వారి ముందస్తు ఆదేశాలు, మార్గదర్శకాలకు లోబడి ఉదయం 10 గంటలకే వినాయకుని శోభాయాత్రను ప్రారంభించారు. ఈ యాత్రలో పెద్ద ఎత్తున పాల్గొన్న మహిళలు, యువతులు పారవశ్యంతో నృత్యాలు చేయగా, పిల్లలు బాణసంచా కాలుస్తూ, కేరింతలు కొడుతూ కోలాహలం సృష్టించారు. మంగళ వాయిద్యాలు, జయజయధ్వానాల నడుమ శోభాయాత్ర కంటిపాపలా సాగింది. అనంతరం పోలీసు శాఖ కేటాయించిన చీమలవాగుపల్లి నిమజ్జన ఘాట్ వద్ద భక్తిశ్రద్ధలతో గణనాథుని విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. ఆర్యవైశ్య పెద్దల మార్గదర్శకత్వంలో అందరి సహకారంతో ఈ ఐదు రోజుల వేడుకలు విజయవంతమయ్యాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రెసిడెంట్ బంగారు బాల, సెక్రటరీ పవన్, యువజన సంఘం సభ్యులు రవి, కేదార్, నితిన్, రాఘవ, సాయిలతో పాటు ఆర్యవైశ్య మహిళా సంఘం సభ్యులు, కాలనీవాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# జిల్లాలో కేంద్ర ప్రభుత్వ పథకాలను ఖచ్చితంగా అమలు చేయాలి

**- కేంద్ర ప్రభుత్వ పథకాల పూర్తి స్థాయి అమలకు నిధులను సద్వినియోగం చేసుకోవాలి**

**- నంద్యాల పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ బైరెడ్డి శబరి**



నంద్యాల, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ ::: జిల్లా అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వ పథకాలను అమలు చేస్తూ100 శాతం నిధులను వినియోగించుకోవాలని, కేంద్ర ప్రభుత్వ పథకాల కింద చేపడుతున్న పనులు నాణ్యతతో చేపట్టాలని, ప్రతిపాదనలు సకాలంలో సిద్ధం చేసి నిధుల వినియోగాన్ని వేగవంతం చేయాలని, కేంద్ర ప్రభుత్వ పథకాల అమలును మరింత సమర్థవంతంగా చేపట్టి, వాటి ప్రయోజనాలు అర్హులైన ప్రజలకు సకాలంలో అందేలా చూడాలనీ, పథకాల అమలకు నిధులను సద్వినియోగం చేసుకోవాలనీ నంద్యాల పార్లమెంటు సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, నంద్యాల జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ చైర్మన్ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. బుధవారం నంద్యాల జిల్లా కలెక్టరేట్ లోని పి జి ఆర్ ఎస్ హాల్ లో జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ (దిశ) సమావేశంలో నంద్యాల పార్లమెంటు సభ్యురాలు, జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ చైర్మన్ డాక్టర్ బైరెడ్డి శబరి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో నంద్యాల జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, ఆళ్లగడ్డ శాసనసభ్యులు భూమా అఖిల ప్రియ, జిల్లా పరిషత్ సీఈఓ ఆర్.సుధాకర్ రెడ్డి, డిప్యూటీ సిఈవో సుబ్బారెడ్డి, సంబంధిత జిల్లా అధికారులతో కలిసి పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ నంద్యాల జిల్లా పరిధిలో వివిధ శాఖల వారిగా అభివృద్ధి కార్యక్రమాలు కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు సాధించిన పురోగతి ఎదురవుతున్న సమస్యలపై సమగ్రంగా చర్చించారు. విద్య, వైద్య రహదారులు, నీటి వనరులు, పశు సంవర్ధక శాఖ తదితర కీలక శాఖలు అమలు అవుతున్న కార్యక్రమాలను శాఖల వారిగా సమీక్షించారు. నంద్యాల పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాల అమలును మరింత సమర్థవంతంగా చేపట్టి, వాటి ప్రయోజనాలు అర్హులైన ప్రజలకు సకాలంలో అందేలా చూడాలనీ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను జిల్లాలో మరింత సమర్థవంతంగా అమలు చేయడం, శాఖల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయాలని అన్నారు. అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని శాఖల వారీగా సమీక్షించారు. ఇప్పటివరకు సాధించిన పురోగతి, నిర్దేశిత లక్ష్యాలు, ఇంకా పూర్తి కావాల్సిన పనులు, ఎదురవుతున్న సమస్యలు, పనుల జాప్యానికి గల కారణాలను చర్చించి వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రభుత్వ పథకాల అమలు పురోగతిని ఎప్పటికప్పుడు అంచనా వేసి, అవసరమైన సరిదిద్దే చర్యలు చేపట్టేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. శాఖల మధ్య సమన్వయంతో అభివృద్ధి పనులు త్రైమాసిక సమీక్షల ద్వారా వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం మరింత బలోపేతం అవుతుందని అన్నారు. పరస్పర సహకారంతో అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయడానికి వీలవుతుందని తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల ప్రయోజనాలు సకాలంలో అందేలా శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా అభివృద్ధికి సంబంధించి చేపట్టాల్సిన కార్యక్రమాలపై ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలని సమావేశంలో నిర్ణయించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలులో నిరంతర పర్యవేక్షణ, సమర్థవంతమైన నిధుల వినియోగం, అభివృద్ధి పనుల పురోగతి, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో జిల్లాలో సమగ్ర అభివృద్ధికి మరింత వేగం చేకూరేలా భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకోవాలని నిర్ణయించారు. జిల్లాను అన్ని రంగాలలో మరింత అభివృద్ధి చేసేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. జిల్లా కలెక్టర్ వ్యవసాయం, ఉద్యానవన, పశుసంవర్ధక, భూ రికార్డులు, గ్రామీణాభివృద్ధి, వైద్య ఆరోగ్యం, సమగ్ర శిక్ష, పంచాయతీరాజ్, ఆర్ డబ్ల్యూ ఎస్, , ఆర్ అండ్ బి, విద్యుత్, పౌర సరఫరాలు, స్కిల్ డెవలప్‌మెంట్, పరిశ్రమలు, సాంఘిక సంక్షేమం, గిరిజన సంక్షేమం, మున్సిపల్ తదితర 70కి పైగా శాఖలు, అంశాలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నుంచి జిల్లాకు మంజూరు అయ్యే నిధులను నిర్ణీత గడువులోగ చేసుకోవాలని తెలిపారు. కేంద్ర ప్రాయోజిత పథకాల కింద మొదటి త్రైమాసికంలో కేటాయించిన నిధుల్లో 82 శాతం వినియోగించినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన నిధులను కూడా నిర్ణీత గడువులోగా పూర్తిస్థాయిలో వినియోగించేలా చర్యలు చేపట్టాలని సమగ్ర శిక్ష, గిరిజన సంక్షేమం తదితర శాఖలు వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పి ఎం శ్రీ పథకం కింద ఎంపికైన పాఠశాలల్లో ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, క్రీడా మైదానాలు తదితర మౌలిక వసతుల పనులను వేగవంతం చేయాలని అన్నారు. ాఠీ-జీూచీహీూచీ కింద చేపడుతున్న రహదారులు, హాస్టళ్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా అభివృద్ధిలో ప్రతి శాఖ సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి, తదుపరి త్రైమాసిక సమీక్ష నాటికి నిర్దేశిత లక్ష్యాల మేరకు 100 శాతం పురోగతి సాధించేలా కార్యాచరణ రూపొందించుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల ప్రయోజనాలు ప్రజలకు పూర్తిస్థాయిలో అందేలా నిరంతరం పర్యవేక్షించాలని, నిధుల వినియోగం, పనుల నాణ్యత, లక్ష్య సాధనలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు సంబంధించి నిధులు విడుదలకు అవసరమైన ప్రతిపాదనలను వివిధ శాఖల అధికారులు సకాలంలో సిద్ధం చేయాలన్నారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సి ఎస్ ఆర్) నిధుల ద్వారా చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన ప్రతిపాదన కూడా వీలైనంత త్వరగా అందజేయాలని తెలిపారు. నందికొట్కూరు మెడికల్ అండ్ హెల్త్ శాఖకు సంబంధించి ఇచ్చిన ఆరోపణపై సమగ్రంగా విచారణ చేపట్టి వాస్తవాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనాథ శరణాలయాలు అంగన్వాడి కేంద్రాల పనితీరు మౌలిక వసతులు అందుతున్న సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలని అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. గడివేముల నుంచి నందికొట్కూరు వెళ్లే మార్గంలో కె.సి కెనాల్ రోడ్డు మరమ్మత్తు పనులను త్వరగా తమ పూర్తి చేసి ప్రజలకు రహదారి అందుబాటులోకి తీసుకువచ్చేలా చూడాలన్నారు. ఆళ్లగడ్డ శాసనసభ్యురాలు భూమా అఖిల ప్రియ మాట్లాడుతూ ఆళ్లగడ్డ నియోజకవర్గంలో అమలు చేసి కేంద్ర ప్రభుత్వ పథకాల పురోగతికి నిధుల సద్వినియోగం గురించి సంబంధిత శాఖల అధికారులతో క్షుణ్ణంగా చర్చించారు. కేంద్ర ప్రభుత్వాలు పథకాలు నిధులు సద్వినియోగం ఆళ్లగడ్డ నియోజకవర్గం అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ పథకాల అమలకు పూర్తిస్థాయిలో నిధులను వినియోగించి నియోజకవర్గం అభివృద్ధికి తోడ్పడాలన్నారు. పశు సంవర్ధక శాఖ ఆధర్వంలో అమలవుతున్న ఏబిఐపి, ఎన్‌ఏఐపి కార్యక్రమాలపై అవగాహన కల్పించాలన్నారు.



# యాడికిలో ఆధ్యాత్మిక ఉత్సాహం నడుమ వినాయక నిమజ్జనం

**: హోరెత్తిన వేలం పాటలు**

**యాడికి సెప్టెంబరు 16 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక :**



మండల కేంద్రంలోని హాస్పిటల్ కాలనీలో వెలసిన శ్రీరాముని దేవాలయం వెనుక భాగంలో, ఆలూరు చంద్రశేఖర్ రెడ్డి ఇంటి వద్ద ప్రతిష్ఠించిన గణనాథుని ఐదు రోజుల ఉత్సవాలు బుధవారం నిమజ్జనోత్సవంతో అత్యంత ఘనంగా ముగిసాయి.ప్రతిరోజూ ప్రత్యేక అలంకారాలు, ధూపదీప నైవేద్యాలు, హోమాలతో వినాయకుడు విశేష పూజలందుకున్నారు. కాలనీవాసులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో మండప ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. స్వామివారి దర్శనం కోసం భక్తులు క్యూలైన్లలో వేచి ఉండి మొక్కుబడులు చెల్లించుకోవడంతో ఆ ప్రాంతమంతా భక్తిపారవశ్యంతో నిండిపోయింది.సాయంత్రం నిమజ్జనానికి ముందు స్వామివారి ప్రసాదాలు, పూజా ద్రవ్యాలకు నిర్వహించిన బహిరంగ వేలం పాట భక్తుల కోలాహలం నడుమ రసవత్తరంగా సాగింది. పోటీపడి మరీ దక్కించుకునేందుకు భక్తులు ఉత్సాహం చూపారు. ఈ వేలంలో స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని ఆలూరు చంద్రశేఖర్ రెడ్డి రూ. 5,700లకు దక్కించుకున్నారు. అలాగే స్వామివారి నుదుటి వెండి బిళ్ల మరియు వెండి నాణేన్ని చింత ప్రకాష్ రూ. 15,500లకు పాడుకోగా, స్వామివారి బొడ్డు వెండి బిళ్లను రూ. 8,100లకు, కలశం చెంబును రూ. 13,800లకు నంద్యాల రంగస్వామి సొంతం చేసుకున్నారు.వేలం పాట పూర్తయిన అనంతరం స్వామివారిని సర్వాంగ సుందరంగా అలంకరించి, భక్తుల జయ జయధ్వానాలు, తప్పెట్లు-తాళాలు, మంగళ వాయిద్యాలు, యువకుల నృత్యాల నడుమ ప్రధాన వీధుల గుండా వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. దారి పొడవునా మహిళలు స్వామివారికి హారతులు పట్టి వీడ్కోలు పలికారు. అనంతరం లంబోదరుని విగ్రహాన్ని సమీపంలోని చీమలవాగుపల్లి వద్ద భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాలను విశేషంగా ఏర్పాటు చేశారు.

# చెరువులు నింపండి. పంటలు కాపాడండి.

**శ్రీశైలం నుంచి నీళ్లు వస్తున్నా.. అనంత చెరువులు ఎందుకు నిండడం లేదు**

**కరువు కాటుకు రైతన్న విలవిల.. అనంతకు నీళ్లివ్వండి.. రైతుల కన్నీళ్లు తుడవండి**

**రైతన్నను బతికించండి.. హంద్రీ--నీవా నీళ్లు విడుదల చేయండి**

**శ్రీశైలంలో నీళ్లున్నా.. అనంత రైతులకు కన్నీళ్లేనా**

**50 రోజులుగా నీటి కోసం ఎదురుచూపులు..**

**చెరువులకు చుక్క నీరు లేదు**

**శ్రీశైలం నుంచి ఇంకా 17 టీఎంసీల వరకు తెచ్చుకునే అవకాశం ఉంది**

**కరువుతో ఎండిపోతున్న పంటలు.. చెరువులు నింపాలని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి డిమాండ్**




అనంత పురం బ్యూరో సెప్టెంబర్ 16 నేటి శుభోదయ : అనంతపురం జిల్లా తీవ్ర కరువుతో అల్లాడుతోందని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అన్నారు. శ్రీశైలం డ్యాం నుంచి ఆగస్టు 5న నీటి విడుదల ప్రారంభమైనా సుమారు 50 రోజులు గడిచినప్పటికీ అనంతపురం జిల్లాలో చెరువులకు నీటిని విడుదల చేయలేదన్నారు. చెరువులకు నీళ్లు వదిలే ఆదేశాలు తమకు లేవని అధికారులు చెబుతున్నారని తెలిపారు. బుధవారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.శ్రీశైలం డ్యాంలో 180 టీఎంసీల నుంచి 112 టీఎంసీలకు నీటిమట్టం తగ్గిందని, అయినా 835 అడుగుల వరకు నీటిని డ్రా చేసుకునే అవకాశం ఉందన్నారు. ప్రస్తుత నీటి లభ్యత, వివిధ ప్రాజెక్టులకు విడుదలను పరిశీలిస్తే హంద్రీ--నీవా ద్వారా ఇంకా దాదాపు 17 టీఎంసీల వరకు నీటిని పొందే అవకాశం ఉందని పేర్కొన్నారు."పంటలు ఎండిపోతున్నాయి.. భూగర్భజలాలు అడుగంటుతున్నాయి.." చీనీ, అరటి, మిరప, టమాట తదితర పంటలు నీరందక ఎండిపోతున్నాయని ప్రకాష్ రెడ్డి తెలిపారు. భూగర్భజలాలు పడిపోవడంతో రైతులు సాగు చేసిన పంటలను వదిలేసుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. రైతాంగాన్ని కాపాడేందుకు హంద్రీ--నీవా కింద ఉన్న చెరువులన్నింటినీ వెంటనే నింపాలని కోరారు. "వెలిగొండ ట్రయల్ రన్ కంటే.. కరువు రైతులే ముఖ్యం"వెలిగొండ ప్రాజెక్టు ప్రస్తుతం ట్రయల్ రన్‌లోనే ఉందని, ప్రధాన సొరంగం పూర్తయినా కాలువలు, బ్రాంచ్ కాలువలు, పంపిణీ వ్యవస్థ ఇంకా పూర్తికావాల్సి ఉందన్నారు. ప్రస్తుతం వెలిగొండకు విడుదల చేస్తున్న నీటిని తగ్గించి హంద్రీ--నీవా, ముచ్చుమర్రి ద్వారా రాయలసీమ ప్రాంతాలకు అందించాలని కోరారు."49 చెరువులకు తుంగభద్ర నీళ్లు ఇవ్వాలి" తుంగభద్ర డ్యాం నుంచి పీఏబీఆర్‌కు నీటిని విడుదల చేసి పీఏబీఆర్ కుడికాలువ కింద ఉన్న 49 చెరువులను నింపాలని డిమాండ్ చేశారు. హంద్రీ--నీవా కింద ఉన్న అన్ని చెరువులతో పాటు పేరూరు డ్యాంకు కూడా నీటిని విడుదల చేయాలని కోరారు.నేడు హంద్రీ--నీవా సీఈ కార్యాలయం ఎదుట జలదీక్ష.రైతుల నీటి సమస్య పరిష్కారం కోసం గురువారం హంద్రీ--నీవా సీఈ కార్యాలయం ఎదుట జలదీక్ష చేపడుతున్నట్లు ప్రకాష్‌రెడ్డి తెలిపారు. రైతులు, రైతు సంఘాల నాయకులు, ప్రతిపక్ష పార్టీల నాయకులు పాల్గొంటారని చెప్పారు. తొమ్మిది నియోజకవర్గాల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తరలివస్తారని వెల్లడించారు.

# యాడికిలో 'రెవిన్యూ క్లినిక్' భూ సమస్యల త్వరిత పరిష్కారమే లక్ష్యం

**-- తహసీల్దార్ ప్రతాప్ రెడ్డి**



యాడికి సెప్టెంబరు 16 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక : ప్రజల భూ సంబంధిత సమస్యలను వేగవంతంగా, పారదర్శకంగా పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని యాడికి తహసీల్దార్ కె. ప్రతాప్ రెడ్డి తెలిపారు. బుధవారం మధ్యాహ్నం మండల తహసీల్దార్ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పి.జి.ఆర్.యస్ అర్జీల పరిష్కారం కోసం ప్రత్యేకంగా "రెవిన్యూ క్లినిక్" కార్యక్రమాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు వెల్లడించారు. ఈ వేదిక ద్వారా ప్రజల నుంచి వచ్చిన భూ సమస్యలు, ఇతర ఫిర్యాదులను నేరుగా స్వీకరించి పరిష్కరిస్తున్నామన్నారు.యాడికి మండలంలో గడిచిన ఏడాది కాలంలో మొత్తం 364 పి.జి.ఆర్.యస్ అర్జీలు రాగా, విచారణ చేపట్టి ఇప్పటివరకు 229 అర్జీలను విజయవంతంగా పరిష్కరించినట్లు తహసీల్దార్ వెల్లడించారు. ముఖ్యంగా వెబ్‌ల్యాండ్‌లో పేర్ల నమోదు, 22-ఎ నిషేధిత భూముల సమస్యలు, భూ రీసర్వే, దారి తగాదాలు వంటి సున్నితమైన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి నిర్ణీత వ్యవధిలో పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. అలాగే ఆగస్టు నెలలో వచ్చిన 17 అర్జీల్లో ఇప్పటికే 15 పిటిషన్లను పరిష్కరించామని, మిగిలిన 2 అర్జీలు విచారణ దశలో ఉన్నాయని స్పష్టం చేశారు. ప్రభుత్వ వేదికలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరిన ఆయన, పెండింగ్‌లో ఉన్న ప్రతి అర్జీని త్వరితగతిన కొలిక్కి తెచ్చేందుకు రెవిన్యూ యంత్రాంగం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు.

# సర్--2026 ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలి

**- కృష్ణా రోల్ అబ్జర్వర్ సి.హెచ్. శ్రీధర్**

**-ముసాయిదా జాబితాపై క్లెయిమ్స్, అభ్యంతరాలను నిబంధనల మేరకు పరిష్కరించాలి**

**-97.37 శాతం హియరింగ్స్ పూర్తి.. పెండింగ్ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలి**




మచిలీపట్నం: సెప్టెంబర్ 16 నేటి శుభోదయ : కృష్ణా జిల్లాలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ--2026 (సర్) ప్రక్రియలో పెండింగ్ పనులను వేగంగా పూర్తి చేసి, నిర్దేశిత కాలపరిమితిలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పూర్తి చేయాలని కృష్ణా జిల్లా రోల్ అబ్జర్వర్, మైనారిటీస్ వెల్ఫేర్ శాఖ ప్రభుత్వ కార్యదర్శి సి.హెచ్. శ్రీధర్ అధికారులను ఆదేశించారు.మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ డీకే బాలాజి, జాయింట్ కలెక్టర్ ఎం నవీన్, డీఆర్ఓ కే శ్రీధర్ రెడ్డి, ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, ఎన్నికల అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. జూలై 31న ప్రచురించిన ముసాయిదా జాబితా ప్రకారం జిల్లాలో 14,05,580 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు వివరించారు.సర్ ప్రక్రియలో భాగంగా సెప్టెంబర్ 15 నాటికి 1,09,953 నోటీసులు జారీ/డెలివరీ చేయగా, 1,07,060 హియరింగ్స్ పూర్తయ్యాయి. దీంతో 97.37 శాతం హియరింగ్స్ పూర్తికాగా, 2,893 హియరింగ్స్ మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని త్వరగా పూర్తి చేయాలని రోల్ అబ్జర్వర్ ఆదేశించారు.ఫారం--6 దరఖాస్తుల్లో అర్హులైన ప్రతి ఓటరును జాబితాలో చేర్చేలా చర్యలు తీసుకోవాలని, ఫారం--7 దరఖాస్తులను క్షేత్రస్థాయి ధృవీకరణతోనే పరిష్కరించాలని సూచించారు. మరణించిన, శాశ్వతంగా తరలిపోయిన, డూప్లికేట్ ఓటర్లను నిబంధనల ప్రకారం గుర్తించడంతో పాటు, అర్హులైన ఏ ఓటరు పేరు అనవసరంగా తొలగించకూడదని స్పష్టం చేశారు. ఫారం--8 ద్వారా వచ్చిన చిరునామా మార్పులు, ఇతర సవరణలను కూడా సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. ముసాయిదా ఓటర్ల జాబితాను రాజకీయ పార్టీలు పరిశీలించి, పేర్లు, చిరునామాలు, ఫొటోలు, మరణించిన లేదా తరలిపోయిన ఓటర్లు, డూప్లికేట్ ఎంట్రీల్లో లోపాలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని రోల్ అబ్జర్వర్ కోరారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు పోలింగ్ స్టేషన్ల నిర్వహణ, ఓటర్ల క్రమబద్ధీకరణ తదితర అంశాలపై సూచనలు చేశారు.అర్హత కలిగిన ప్రతి పౌరుడి పేరు జాబితాలో ఉండేలా చూడడంతో పాటు, అనర్హమైన ఎంట్రీలను నిబంధనల ప్రకారం తొలగించి ఖచ్చితమైన, పారదర్శకమైన ఓటర్ల జాబితా రూపొందించేందుకు ఎన్నికల యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని రోల్ అబ్జర్వర్ ఆదేశించారు.అనంతరం ఆయన స్థానిక పాండురంగ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి సర్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సంబంధిత అధికారులను పురోగతిని అడిగి తెలుసుకున్నారు.సమావేశంలో మచిలీపట్నం, గుడివాడ, ఉయ్యూరు ఆర్డీవోలు కే సాంబశివరావు, జి బాలసుబ్రమణ్యం, ఎస్ కరుణ కుమారి, ఈఆర్ఓలు, ఏఈఆర్వోలు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై దాడి కేసు నమోదు చేయాలని పోలీసులకు ఫిర్యాదు



యాడికి సెప్టెంబర్ 16 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక : యాడికి సీఐ శ్రీనివాసులు కి కె.సుగుమంచిపల్లె గ్రామానికి చెందిన ఆర్టీసీ ఆర్టీసీ బస్సు డ్రైవర్ జి. రహీంబాబు ఫిర్యాదు చేశారు. తాను తాడిపత్రి డిపోకు చెందిన 'పల్లె వెలుగు' బస్సు (నెంబరు ఎపి02టియి 2779)ను గత 10 సంవత్సరాలుగా తాడిపత్రి నుండి గుత్తికి నడుపుతున్నట్లు తెలిపారు. ఈ నెల 16న ఉదయం 5:15 గంటలకు తాడిపత్రి నుంచి బయలుదేరి యాడికి గ్రామంలోని రోడ్డుపై ప్రయాణికులను ఎక్కించుకుని గుత్తికి వెళ్తుండగా, వెనుక నుంచి మోటార్ సైకిల్‌పై వచ్చిన ఒక వ్యక్తి బస్సును నిలిపి, బస్సు ఆపిన తర్వాత అతను డ్రైవర్‌ను నానా దుర్భాషలాడుతూ కొట్టడానికి ప్రయత్నించగా, బస్సులోని ప్రయాణికులు అడ్డుకుని అతడిని కిందకు దించేశారు. ఆ తర్వాత డ్రైవర్ గుత్తికి వెళ్లి, తిరిగి తాడిపత్రికి వచ్చి మళ్లీ గుత్తికి వెళ్తుండగా.. యాడికి గ్రామంలోని కోన రోడ్డు వద్ద యాడికి మండలం పిన్నేపల్లి గ్రామానికి చెందిన జ్ఞానేశ్వర్ రెడ్డి అనే ఆ వ్యక్తి మరికొందరితో కలిసి బస్సును అడ్డుకున్నాడు. డ్రైవర్‌ను చెంపదెబ్బలు కొట్టి తీవ్రంగా దాడి చేశారు. ఈ ఘటనపై విచారణ జరిపి, దాడికి పాల్పడిన జ్ఞానేశ్వర్ రెడ్డితో పాటు ఇతరులపై కఠిన చర్యలు తీసుకోవాలని రహీంబాబు తన ఫిర్యాదులో కోరారు. సాక్షుల సంతకాలు, వివరాలను కూడా పోలీసులకు అందజేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని రహీం బాబుకి తెలిపారు.

# యాడికిలో ఇంటింటికీ లెప్రసీ సర్వే

**అవగాహన కల్పించిన డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ రామచంద్ర**



యాడికి, సెప్టెంబరు 16 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక : మండల కేంద్రంలోని 12, 15 వార్డుల్లో బుధవారం కుష్టు వ్యాధి గుర్తింపు చర్యల్లో భాగంగా 'ఇంటింటి సర్వే (లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్)' నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, వాలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు కుష్టు వ్యాధి లక్షణాలపై అవగాహన కల్పించడంతో పాటు ఆన్‌లైన్ సర్వే నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ పి. రామచంద్ర మాట్లాడుతూ.. చర్మంపై స్పర్శలేని రాగి రంగు లేదా తెల్లటి మచ్చలు, కందరాలు, అరచేతులు, అరకాళ్లలో స్పర్శ కోల్పోవడం, చర్మంపై బుడపలు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే యాడికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో డాక్టర్‌ను సంప్రదించాలని సూచించారు. వ్యాధిని ప్రారంభంలోనే గుర్తిస్తే పూర్తిస్థాయిలో నయం చేయవచ్చని, ప్రభుత్వాసుపత్రిలో ఉచితంగా చికిత్సతో పాటు ఎండీటీ మందులు అందజేస్తామని తెలిపారు. ప్రజలు ఎటువంటి భయాందోళనలు లేకుండా ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రామ్‌ప్రసాద్ గౌడ్, ఆశా కార్యకర్తలు లక్ష్మి, నాగ సులోచన, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు...

# నేడు కృష్ణా జిల్లా కలెక్టరేట్‌లో ఇండస్ట్రియల్ బిజినెస్ మీట్

**-పారిశ్రామిక, వ్యాపార రంగ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక వేదిక**

**-సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి పిలుపు**



మచిలీపట్నం, సెప్టెంబరు 16 నేటి శుభోదయ : కృష్ణా జిల్లాలో పారిశ్రామిక, వ్యాపార రంగ అభివృద్ధికి మరింత ప్రోత్సాహం అందించేందుకు జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో గురువారం జిల్లా కలెక్టరేట్‌లో ఇండస్ట్రియల్ బిజినెస్ మీట్ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డీకే బాలాజి ఒక తెలిపారు. ఇటీవల కృష్ణా విశ్వవిద్యాలయంలో నిర్వహించిన 'వన్ ఫ్యామిలీ--వన్ ఎంటర్‌ప్రెన్యూర్' వర్క్‌షాప్‌కు లభించిన విశేష స్పందనకు కొనసాగింపుగా ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపిన కలెక్టర్, కొత్తగా వ్యాపారం లేదా పరిశ్రమ ప్రారంభించాలనుకునే ఔత్సాహికులు, ఇప్పటికే వ్యాపారాలు నిర్వహిస్తున్న పారిశ్రామికవేత్తలు తమకు ఎదురవుతున్న సమస్యలు, అవసరాలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు ఈ సమావేశం అవకాశం కల్పిస్తుందని తెలిపారు. వ్యాపారాలు ప్రారంభించేందుకు అవసరమైన ప్రభుత్వ అనుమతులు, వివిధ శాఖల నుంచి అందాల్సిన సహకారం, ఇతర సమస్యలపై సంబంధిత అధికారులతో నేరుగా చర్చించే అవకాశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. జిల్లా యంత్రాంగానికి చెందిన వివిధ శాఖల అధికారులు సమావేశంలో అందుబాటులో ఉంటారని, సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కృష్ణా జిల్లాలో వ్యాపార అవకాశాలను అన్వేషిస్తున్న ఇతర ప్రాంతాల పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు కూడా సమావేశంలో పాల్గొని జిల్లాలో అందుబాటులో ఉన్న అవకాశాలు, ప్రభుత్వ సహకారం, అనుమతులు తదితర అంశాలపై అధికారులతో చర్చించవచ్చని కలెక్టర్ తెలిపారు.గురువారం కలెక్టరేట్‌లో జరిగే ఇండస్ట్రియల్ బిజినెస్ మీట్‌కు పారిశ్రామికవేత్తలు, వ్యాపార ఔత్సాహికులు, పెట్టుబడిదారులు హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు. సమావేశానికి సంబంధించిన సమాచారం కోసం 9989092288 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

# గన్నవరంలో అన్న క్యాంటీన్ ప్రారంభం.. ప్రారంభించిన విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

**-రోజూ 400 మందికి అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందజేత**

**-రాత్రి భోజనం కూడా అందించాలని సీఎం చంద్రబాబుకు లేఖ రాశా : ఎమ్మెల్యే**

**-కూటమి నేతలతో కలిసి స్వయంగా అన్నం వడ్డించి..**



గన్నవరం, సెప్టెంబర్ 16నేటి శుభోదయ: పేదల ఆకలి తీర్చడమే అన్నా క్యాంటీన్ల ప్రధాన ధ్యేయమని, గన్నవరం నియోజకవర్గ అభివృద్ధిని మరింత వేగవంతం చేసే దిశగా నిరంతరం కృషి చేస్తున్నామని ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. గన్నవరం బాయ్స్ హైస్కూల్ మైదానం పక్కన ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ప్రారంభోత్సవం అనంతరం కూటమి నాయకులతో కలిసి స్వయంగా పేదలకు అన్నం వడ్డించారు. అనంతరం ఆటో కార్మికులతో కలిసి భోజనం చేశారు. ఉంగుటూరు మండలం నందమూరు గ్రామానికి చెందిన మాధురి అనే విద్యార్థి తాను దాచుకున్న పాకెట్ మనీ నుంచి రూ.2,500 విశ్రాంత అధ్యాపకుడు మద్దుకూరి విజయ్‌కుమార్ రూ.లక్ష రూపాయలను అన్న క్యాంటీన్ నిర్వహణ కోసం విరాళంగా అందించారు. పేదలకు ఉపయోగపడే కార్యక్రమానికి స్వచ్ఛందంగా విరాళాలు అందించిన వారిని ఎమ్మెల్యే అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైన అన్నా క్యాంటీన్లలో గన్నవరం కేంద్రం 277వ దని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కేంద్రం ద్వారా రోజూ సుమారు 400 మందికి ఉదయం నాణ్యమైన అల్పాహారం, మధ్యాహ్నం భోజనం అందించనున్నట్లు చెప్పారు. పేదలకు రాత్రి భోజనం కూడా అందించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడిని కోరుతూ లేఖ రాసినట్లు వెల్లడించారు. గన్నవరంతో పాటు రామవరప్పాడులో మరో అన్నా క్యాంటీన్ మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. గన్నవరం నియోజకవర్గ రూపురేఖలు వేగంగా మారుతున్నాయని యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. దావాజీగూడెం రహదారి, గాంధీబొమ్మ సెంటర్, కోనాయ చెరువు తదితర ప్రాంతాలను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. గన్నవరం వార్తలు ప్రసారం చేసేటప్పుడు రైల్వే స్టేషన్ బోర్డును మాత్రమే కాకుండా గాంధీబొమ్మ సెంటర్, ఎన్టీఆర్ విగ్రహం వంటి ప్రాంతాలను కూడా చూపించాలని మీడియాను కోరారు. ఎన్.హెచ్ పిడి విద్యాసాగర్‌తో మాట్లాడి గాంధీబొమ్మ సెంటర్‌లో గన్నవరం నియోజకవర్గం పేరుతో భారీ సూచిక బోర్డు ఏర్పాటు చేయించినట్లు వివరించారు. అమరావతి నిర్మాణంతో గన్నవరం రాజధానికి ప్రధాన ముఖద్వారంగా మారుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అయోధ్య గేటెడ్ కమ్యూనిటీ వద్ద 'ఐ లవ్ గన్నవరం', 'వెన్ అమరావతి షైన్స్.. గన్నవరం రైజెస్' బోర్డులు ఏర్పాటు చేయాలని అపార్ట్మెంట్ వాసులకు సూచించినట్లు తెలిపారు. అక్కడి తాగునీరు, పన్నుల సమస్యలను 15 రోజుల్లో పరిష్కరించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. విమానాశ్రయం ఎదురుగా సీ-డాక్ కేంద్రాన్ని తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని యార్లగడ్డ తెలిపారు. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి నారా లోకేశ్ కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్‌కు లేఖ రాసినట్లు వెల్లడించారు. ప్రస్తుతం అదే ప్రాంగణంలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో భారీ కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటుకు చేసేందుకు అంగీకారం తెలిపారని అందుకోసం ప్రత్యామ్నాయంగా మరోచోట స్థలాన్ని పరిశీలించాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. తాను ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేస్తానని, కక్షసాధింపు రాజకీయాలకు దూరంగా ఉంటానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఒక్క వైసీపీ కార్యకర్తపైనా అక్రమ కేసు కూడా తన హయం లో పెట్టలేదని అన్నారు. ఆర్భాటపు ప్రారంభోత్సవాలు, దొంగ శంకుస్థాపనలు తనకు అలవాటు లేదని, 'చెప్పిందే చేస్తా.. చేసేదే చెబుతా' అన్న నిబద్ధతతో పనిచేస్తున్నానని పేర్కొన్నారు. గన్నవరం నియోజకవర్గానికి గత వైభవాన్ని తీసుకురావడమే తన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మాజీ సీఎం వైయస్ జగన్ ను కలిసిన కాగాజ్ ఘర్ రిజ్వాన్



అనంతపురం బ్యూరో సెప్టెంబర్ 16 నేటి శుభోదయ : ఈ రోజు తాడేపల్లి లోని వైస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా మాజీ వక్ఫ్ బోర్డు చైర్మన్ కాగజ్ ఘర్ రిజ్వాన్...ఈ కలియిక సందర్భంగా ఆయన కూటమి ప్రభుత్వం మైనారిటీల మీద జరుగుతున్న దాడులు అరాచకాలు గురుంచి వివరించడం జరిగింది .అదే విధంగా ఈ కూటమి ప్రభుత్వం మైనారిటీ లను సంక్షేమ పథకాలలో కూడా ఎంత మోసం చేస్తోందో వివరించడం జరిగింది.అదేవిధంగా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో ఏవిధంగా పని చేయాలనో మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి వివరించడం జరిగింది.జిల్లా మాజీ వక్ఫ్ బోర్డు చైర్మన్ కాగజ్ ఘర్ రిజ్వాన్ తో పాటు రాష్ట్ర హజ్ కమిటీ మాజీ చైర్మన్ గౌసుల్ ఆజమ్ , ఇతర మైనారిటీ నాయకులు వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి ని కలిసిన వారిలో ఉన్నారు.

## ఇంద్రకీలాద్రిపై ఉన్న శ్రీ గణపతి కి ప్రత్యేక పూజలు, పూర్ణాహుతి కార్యక్రమం



విజయవాడ, సెప్టెంబర్ 16 (నేటి శుభోదయ):-ఇంద్రకీలాద్రి పై వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా శ్రీ లక్ష్మి గణపతి ఆలయం లో ప్రతిష్టించిన గణపతి కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం ఉదయం ఉత్సవ ముగింపు, పూర్ణాహుతి ప్రత్యేక పూజలు నటరాజస్వామి వారి ఆలయ ప్రాంగణంలో ఆలయం స్థానాచార్య వి. శివ ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో జరిగాయి.ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ ), ఈవో వికె శీనా నాయక్ తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం పవిత్ర కృష్ణా నదిలో విగ్రహం నిమజ్జనం జరుగుతుందని వైదిక కమిటీ వారు తెలియజేసారు.

## పురపాలక ఎన్నికల ఏర్పాట్లను వేగవంతం చేయాలి వియంసి కమిషనర్ ధ్యానచంద్ర



విజయవాడ, సెప్టెంబర్ 16 (నేటి శుభోదయ):-పురపాలక ఎన్నికల ఏర్పాట్లను వేగవంతం చేయాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. బుధవారం ఉదయం ప్రధాన కార్యాలయంలోని తన ఛాంబర్లో రానున్న పురపాలక ఎన్నికల నేపథ్యంలో శాఖాధిపతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, నగరంలో డివిజన్ల సంఖ్యను 86కు పెంచుతూ గెజిట్ నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో తదుపరి చేపట్టాల్సిన ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. డివిజన్ల వారీగా ఓటర్ల జాబితాలను సిద్ధం చేసి, ఫోటో ఎలక్టోరల్ రోల్స్‌ను ఈ నెల 22, నాటికి ప్రచురించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రచురించిన ఓటర్ల జాబితాలను ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండేలా సంబంధిత కార్యాలయాల్లో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.అదేవిధంగా డివిజన్ల వారీగా పోలింగ్ కేంద్రాలను గుర్తించే ప్రక్రియను వేగవంతం చేయాలని కమిషనర్ సూచించారు. ఓటర్ల జాబితాకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాలను గుర్తించి, వాటిని ఊూ ద్వారా మార్కింగ్ చేయడంతో పాటు, ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాల పూర్తి వివరాలతో నివేదికను సమర్పించాలని అధికారులను ఆదేశించారు.పోలింగ్ కేంద్రాల గుర్తింపు పూర్తయిన వెంటనే అక్కడ అవసరమైన మౌలిక వసతులు, విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలు సమకూర్చేలా ఇంజనీరింగ్ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేసి, ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు.జోనల్ కమిషనర్లు తమ పరిధిలోని డివిజన్లలో జరుగుతున్న ఎన్నికల ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రతి పనిని నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. మిడ్ లెవెల్ అధికారులుగా జోనల్ కమిషనర్లు తమ పరిధిలోని పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించి, అవసరమైన చోట వేగవంతమైన చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ సమావేశంలో అదనపు కమిషనర్ జనరల్ ఏ. రవీంద్రరావు, చీఫ్ ఇంజనీర్ పి. సత్యకుమారి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ నిర్మల గ్లోరీ, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) సృజన, ఎస్టేట్ ఆఫీసర్ ఎస్. శ్రీధర్, అసిస్టెంట్ కమిషనర్ చక్రవర్తి, అకౌంట్స్ ఆఫీసర్ బి. సత్యనారాయణమూర్తి, ఆర్.ఎఫ్.ఓ సి.హెచ్. రత్నబాబు, ఎలక్షన్ డీటీలు సురేష్ కుమార్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛత సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి వియంసి కమిషనర్ ధ్యానచంద్ర



విజయవాడ, సెప్టెంబర్ 16 (నేటి శుభోదయ):-ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛత సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. బుధవారం ఉదయం ప్రధాన కార్యాలయంలోని తన ఛాంబర్లో స్వచ్ఛత సేవా కార్యక్రమంపై శాఖాధిపతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ, సెప్టెంబర్ 17, 2026 నుంచి అక్టోబర్ 17, 2026 వరకు నిర్వహించనున్న స్వచ్ఛత సేవా కార్యక్రమాన్ని ప్రజల భాగస్వామ్యంతో విజయవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. నెల రోజుల పాటు ప్రతిరోజూ ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టనున్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.స్వచ్ఛత సేవా కార్యక్రమం ద్వారా నగరంలోని ప్రతి ప్రాంతంలో పరిశుభ్రతపై అవగాహన పెంపొందించడంతో పాటు, ప్రజలను పెద్ద ఎత్తున భాగస్వాములను చేసి స్వచ్ఛతను ప్రజా ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లాలని కమిషనర్ పేర్కొన్నారు. ప్రతి కార్యక్రమంలో అధికారులు, సిబ్బందితో పాటు ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, వివిధ వర్గాల ప్రతినిధులను భాగస్వాములను చేయాలని సూచించారు.ప్రతిరోజూ నిర్వహించే కార్యక్రమం ఒక ప్రత్యేక సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేలా ప్రణాళిక రూపొందించుకోవాలని, స్వచ్ఛత పట్ల ప్రతి ఒక్కరిలో బాధ్యతాభావాన్ని పెంపొందించే విధంగా కార్యక్రమాలను నిర్వహించాలని అధికారులకు సూచించారు. నగరాన్ని మరింత పరిశుభ్రంగా, పచ్చగా, ఆరోగ్యకరంగా తీర్చిదిద్దే దిశగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కమిషనర్ ఏ. రవీంద్రరావు, చీఫ్ ఇంజనీర్ పి. సత్యకుమారి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ నిర్మల గ్లోరీ, పర్యవేక్షణ ఇంజనీర్ చంద్రశేఖర్, డిప్యూటీ డైరెక్టర్ (హార్టికల్చర్) చంద్రశేఖర్, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జోనల్ కమిషనర్లు శ్రీనివాస్, ప్రభుదాస్, షమ్మీ, జోనల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి మత్తు..చిన్నోళ్లు చిత్తు

**-బానిసలవుతున్న పాఠశాల విద్యార్థులు.**

**-9 నెలల్లో జువైనల్ హోంకు పది మంది బాలలు**



గుడివాడ, సెప్టెంబర్ 16 నేటి శుభోదయ: కృష్ణా జిల్లాలో బాలలు తరచూ గంజాయి కేసుల్లో అరెస్టు అవుతుండడం తల్లిదండ్రులను కలవరపెడుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఈగల్ బృందాలు జల్లెడ పడుతున్నా చాపకింద నీరులా రోజు రోజుకీ గంజాయి వినియోగం కొనసాగుతూనే ఉంది. అధికారులు ఎన్ని దారులు మూసినా గంజాయి స్మగ్లర్లు కొత్తదారులు వెతుకుతూనే ఉన్నారు. పైగా విద్యా సంస్థలే లక్ష్యంగా గంజాయి స్మగ్లర్లు చెలరేగిపోతున్నారు. ఇంజినీరింగ్, పాలిటెక్నిక్, జూనియర్ కళాశాలలతో పాటు పలుచోట్ల పాఠశాల విద్యార్థులకు సైతం గంజాయిని అలవాటు చేస్తున్నారు. జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబరు 15 నాటికి దాదాపుగా పది మంది వరకూ బాలలు గంజాయి కేసుల్లో ఇరుక్కోవడంతో జువైనల్ హోంకు తరలించారు. గుడివాడ పట్టణం, కంకిపాడులోని ఓ శివారు కాలనీ, ఉప్పులూరు, ఈడ్పుగల్లు, వణుకూరు, పెనమలూరు, ఉయ్యూరు గ్రామాల్లో కొందరు బాలలకు గంజాయి అలవాటు ఉన్నట్లు పోలీసు అధికారులు గుర్తించారు.

**ఇవిగో ఉదంతాలు.**

ఈ నెల 9న గుడివాడ వన్ టౌన్ పోలీసులు ఇంజినీరింగ్ కళాశాల సమీపంలోని ప్లాట్ల వద్ద గంజాయి అక్రమ రవాణా కేసులో ఇద్దరు యువకులతో పాటు గుడివాడ కొత్తపేట, కార్మికనగర్కు చెందిన 17 ఏళ్ల ఇద్దరు బాలురు దొరకడంతో జువైనల్ హోంకు తరలించారు. జూన్ 19న గుడివాడ వన్ టౌన్ స్టేషన్ పరిధిలో బైపాస్ రోడ్డు సమీపంలో 2కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్న కేసులో ఓ బాలుడు నిందితుడిగా ఉన్నాడు. గుడివాడ పట్టణంలో మూడేళ్ల కిందట గుడివాడ రాజేంద్రనగర్ లోని ఓ పాఠశాలలో పది మంది విద్యార్థులు గంజాయికి బానిసలవడంతో టీసీలు ఇచ్చి పంపేశారు.గంజాయి మత్తులో పరీక్షకు హాజరైన ఓ కళాశాల విద్యార్థిని అధ్యాపకుడు బయటకు పంపారు.తాడిగడపలో ఇటీవల ఇద్దరు బాలలను గంజాయి కేసులో అదుపులోకి తీసుకుని హోంకు పంపారు.పంక్చర్ సొల్యూషన్ మత్తుకు ఓ 14 ఏళ్ల బాలుడు బానిసయ్యాడు. కొద్దిరోజుల కిందట దీనిపై మేనమామ ప్రశ్నించడంతో మనస్తాపంతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

**తీవ్ర ఆగ్రహంతో నేరాలు ప్రభురామ్, మానసిక నిపుణులు**

గంజాయికి అలవాటుపడిన వారికి సకాలంలో అది అందుబాటులో లేకుంటే తీవ్ర ఆగ్రహంతో కుటుంబ సభ్యులు, ఇతరులపై దాడులు చేసే అవకాశాలు ఉన్నాయి.గంజాయి మత్తులో విచక్షణ కోల్పోయి అతివేగంగా వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణమవుతున్నారు. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనను నిత్యం గమనిస్తుండాలి.ముందుగా గుర్తించి సరిదిద్దకుంటే వారి భవిత నాశనం అవుతుంది.

## కౌశలం ప్లేస్‌మెంట్ డ్రైవ్ నందు కాల్స్ అందుకున్న యువత ఇంటర్వ్యూ కి హాజరై సద్వినియోగం చేసుకోండి

**జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్**



అనంతపురం బ్యూరో సెప్టెంబర్ 16 : నేటి శుభోదయ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యువతకు నాణ్యమైన ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో “కౌశలం” కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహిస్తోందని, యువత సద్వినియోగం చేసుకోవాలని, కాల్ అందిన వారు ఇంటర్వ్యూకి తప్పక హాజరు కావాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని ఐటిఐ డిప్లొమా, గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన యువతకు వివిధ ప్రముఖ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించబడుతున్నాయి. కౌశలం అసెస్‌మెంట్ పరీక్షను సంబంధిత స్వర్ణ గ్రామ / స్వర్ణ వార్డుల నందు పూర్తి చేసి, ప్లేస్‌మెంట్ కాల్ అందుకున్న అభ్యర్థులు మాత్రమే ఈ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌కు హాజరై ఇంటర్వ్యూలో పాల్గొనవలసి ఉంటుంది. ఇతర అభ్యర్థులు హాజరు కావాల్సిన అవసరం లేదు. ప్లేస్‌మెంట్ కాల్ అందుకున్న అర్హత కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టరు, అనంతపురము వారు ఒక పత్రికా ప్రకటనలో తెలియచేశారు.

ఉద్యోగం : లాప్టాప్ అసెంబ్లీ ఉ ప్రొడక్షన్ అసోసియేట్
కంపెనీ: అవసర్ హెచ్ ఆర్ ప్రైవేట్ లిమిటెడ్
పని ప్రదేశం: శిక్షణ
డిక్సన్ పాడ్ జెట్ ఎలక్ట్రానిక్స్ కాంచీపురం తమిళనాడు.
జీతం: 2,18,000 -- 2,30,000 (సంవత్సరానికి)
ప్లేస్‌మెంట్ డ్రైవ్ తేదీ: 18.09.2026

అర్హత కలిగిన యువత అధిక సంఖ్యలో పాల్గొని ఈ ఉద్యోగ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరడమైనది. అర్హత కలిగిన యువతీ యువకులకు ఇప్పటికే సంబంధిత స్వర్ణ గ్రామ / స్వర్ణ వార్డు కార్యాలయాల ద్వారా సమాచారం అందించటం జరిగిందనీ, అలాగే సదరు సమాచారం మండల పరిషత్ అభివృద్ధి అధికారులు/ మునిసిపల్ కమీషనర్లు, మండల/ మునిసిపల్ స్వర్ణ గ్రామ/ స్వర్ణ వార్డు అధికారులకు అందుబాటులో ఉంచటం జరిగిందనీ, అలాగే జిల్లా స్థాయిలో నిర్వహించే సదరు ప్లేస్‌మెంట్ డ్రైవ్ కార్యక్రమం విజయవంతం చేయటానికి మండల పరిషత్ అభివృద్ధి అధికారులు / మునిసిపల్ కమీషనర్లు, మండల/ మునిసిపల్ స్వర్ణ గ్రామ/ స్వర్ణ వార్డు అధికారులు పూర్తి స్థాయిలో అర్హత పొందిన అభ్యర్తులను పాల్గొనేటట్లుగా చేసి వారు ఉపాది అవకాశాలు పొందుటకు తోడ్పాటు అందించాలని జిల్లా కలెక్టరు, అనంతపురము వారు కోరారు.

## వినాయక చవితి ఉత్సవాలలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి న మాజీ మంత్రి వెలంపల్లి



విజయవాడ, సెప్టెంబర్ 16 (నేటి శుభోదయ):-మల్లికార్జునపేటలోని బసవ బంగారయ్య వీధిలో, ‘వెంకన్న బాబు ఫ్రెండ్స్ సర్కిల్’ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక చవితి మహోత్సవాలలో బుధవారం మాజీ మంత్రి, విజయవాడ పశ్చిమ వైసిపి ఇంచార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు వడ్డించారు.

## స్వర్గపురిలో పచ్చదనం, పరిశుభ్రతకు మరింత ప్రాధాన్యం వియంసి కమిషనర్ ధ్యానచంద్ర

విజయవాడ, సెప్టెంబర్ 16 (నేటి శుభోదయ):-స్వర్గపురిలో పచ్చదనం పెంచి, పరిశు



భ్రతకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. బుధవారం ఉదయం తన పర్యటనలో భాగంగా కృష్ణలంకలోని స్వర్గపురిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా స్వర్గపురిలోని మౌలిక వసతులు, పారిశుధ్య నిర్వహణ, మరుగుదొడ్లు, స్నానపు గదులు తదితర సౌకర్యాలను కమిషనర్ పరిశీలించారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ స్వర్గపురిలో వచ్చే ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని వసతులను సమకూర్చాలని ఆదేశించారు. మరుగుదొడ్లు, స్నానపు గదులను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, వాటి నిర్వహణపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. స్వర్గపురి పరిసరాల్లో గ్రీనరీని మరింత పెంచాలని, స్వర్గపురిలో వసతుల నిర్వహణలో ఎటువంటి లోపాలు లేకుండా సంబంధిత విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించి తగిన చర్యలు చేపట్టాలని కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ కె. షమీ, చీఫ్ ఇంజనీర్ పి. సత్యకుమారి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ నిర్మల గ్లోరీ, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాల నాయక్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు గోపాలకృష్ణమూర్తి, రామారావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్ బాబు, డిప్యూటీ డైరెక్టర్ (హార్టికల్చర్) చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీటీసీ, జడ్పీటీసీ పోలింగ్ స్టేషన్ల ముసాయిదాపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం




చింతూరు, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ ::: చింతూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈరోజు ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ స్టేషన్ల ముసాయిదా ప్రచురణపై అభ్యంతరాలు, సూచనలు స్వీకరించేందుకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులతో ఎండిఓ సుందం శ్రీనివాస దొర బుధవారం సమావేశం నిర్వహించారు .చింతూరు మండల పరిధిలోని ఎంపీటీసీ /జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితాను 15.09.2026న ప్రచురించడం జరిగిందన్నారు . ముసాయిదా పోలింగ్ స్టేషన్లపై అభ్యంతరాలు లేదా మార్పులు, చేర్పులకు సంబంధించిన సూచనలు తెలియజేయుటకు ఈ సమావేశం ఏర్పాటు చేసామని తెలిపారు .ఈ సమావేశంలో ప్రచురించబడిన పోలింగ్ స్టేషన్ల వివరాలను పరిశీలించిన అనంతరం, ప్రస్తుత ముసాయిదాలో పేర్కొన్న పోలింగ్ స్టేషన్లకు ఎటువంటి మార్పులు లేదా చేర్పులు అవసరం లేదని సమావేశానికి హాజరైన రాజకీయ పార్టీల ప్రతినిధులు తెలియజేశారు.ఈ సమావేశానికి తెలుగుదేశం పార్టీ (టీడీపీ ), జనసేన పార్టీ, భారతీయ జనతా పార్టీ (బిజెపి ), వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైస్సార్సీపీ ), సీపీఐ(ఎం), సీపీఐ పార్టీల ప్రతినిధులతో పాటు చింతూరు మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు, జడ్పీటీసీ సభ్యులు తదితర ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.ఎంపీటీసీ /జడ్పీటీసీ ఎన్నికల ప్రక్రియకు సంబంధించి పోలింగ్ స్టేషన్ల ముసాయిదాపై అభ్యంతరాలు, సూచనలు స్వీకరించే ప్రక్రియలో భాగంగా ఈ సమావేశం నిర్వహించినట్లు చింతూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి సుందం శ్రీనివాసు దొర ఒక ప్రకటన లో తెలియజేశారు.

## డాక్టర్ పెద్దింటి అరుణ ప్రసాద్ మరణం సమాజానికి, నిరుపేదలకు, తీరని లోటు..!

**- పెద్దింటికి పలువురు ఘనంగా నివాళులు**



కోరుకొండ, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);మండల కేంద్రమైన కోరుకొండ శ్రీ రామకృష్ణ నర్సింగ్ హోమ్ ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ పెద్దింటి అరుణ్ ప్రసాద్ (70) మృతి కోరుకొండ మండలనికి, నిరుపేదలకు తీరని లోటని రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, పలువురు వైద్యులు పేర్కొన్నారు. కోరుకొండలో పెద్దింటి కుటుంబం గత కొన్ని దశాబ్దాల నుండి ప్రజలకు విశేషమైన వైద్యసేవలు అందిస్తున్నారని కొనియాడారు. వారి కుటుంబాలకు చెందిన డాక్టర్ అరుణ్ ప్రసాద్ ఏ

వ్యాపార దృక్పథంతో కాకుండా మండలంలోని బడుగు బలహీన వర్గాలకు మెరుగైన వైద్యాన్ని అందించి, అందరి మన్ననలు పొందుతూ వచ్చారన్నారు. ఆయన ఇటీవల కొంత అస్వస్థతకు గురి అయ్యారు. సోమవారం రాజమహేంద్రవరం ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యం పొందుతూ మృతి చెందారు. ఆయన కోరుకొండ, గోకవరం, రాజానగరం మండలాల్లోని పేద, మధ్య తరగతి వర్గాలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వైద్యసేవలు అందించేవారు. డాక్టర్ అరుణ ప్రసాద్ మృతి అన్ని వర్గాల ప్రజలకు తీరని లోటు అని చెప్పక తప్పదు. అరుణ ప్రసాద్ వైద్యరంగంతో పాటు పలు సామాజిక సేవాకార్యక్రమంలో చురుగ్గా పాల్గొంటూ అన్ని విధాల సహాయసహకారాలు అందించేవారు. డాక్టర్ అరుణ ప్రసాద్ “వైద్య కళారత్న” అనే బిరుదు కూడా అందుకున్నారు. ఈయన పలు మండలాల్లో ఆర్ఎంపీలను ప్రోత్సహిస్తూ, గ్రామాల్లో నిరుపేదలకు వైద్యం అందించడానికి తన వంతు సహాయ సహకారాలు అందించేవారు. ఈయన మృతికి పలువురు వైద్యులు, వివిధ రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంఘాలు, వివిధ వర్గాల ప్రజలు సంతాపం తెలియజేస్తూ, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అయన కుటుంబానికి తమ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

## చింతూరులో టీడీపీ శ్రేణుల సమావేశం, 97 కుటుంబాల చేరిక



చింతూరు, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ ::: చింతూరు మండల టీడీపీ కార్యకర్తలు, పార్టీ శ్రేణుల విస్తృత స్థాయి సమావేశం మండల టీడీపీ అధ్యక్షులు మొహమ్మద్ జమాల్ ఖాన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషా దేవి, పోలవరం జిల్లా ఎన్నికల పరిశీలకులు కె సత్తిబాబు, మాజీ ఎమ్మెల్యేలు, సీతంశెట్టి వెంకటేశ్వర్రావు, బాబు రమేష్, వంతల రాజేశ్వరి, మాజీ మండల పార్టీ అధ్యక్షులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఎన్నికలను ఎలా ఎదుర్కోవాలి.. గ్రామస్థాయిలో పార్టీని ఎలా బలోపేతం చేయాలి.. కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో ఎలా ముందుకు సాగాలనే అంశాలపై సమావేశంలో చర్చించారు. ఇదే కార్యక్రమంలో టీడీపీలో భారీగా చేరికలు చోటుచేసుకున్నాయి. పేగ పంచాయతీ పరిధిలోని అహ్మదల్లిపేట, పేగ, కొల్లిగొండ గ్రామాలకు చెందిన సుమారు 60 కుటుంబాలు ఎమ్మెల్యే మిరియాల శిరీషా దేవి, మండల టీడీపీ అధ్యక్షులు మొహమ్మద్ జమాల్ ఖాన్ చేతుల మీదుగా టీడీపీ కండువాలు కప్పుకుని పార్టీలో చేరారు. అలాగే కొత్తపల్లి పంచాయతీకి చెందిన 37 కుటుంబాలు కూడా టీడీపీ కండువాలు కప్పుకుని పార్టీలో చేరారు. మొత్తంగా 97 కుటుంబాలు టీడీపీలో చేరినట్లు పార్టీ నాయకులు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు తమకు నచ్చడంతోనే టీడీపీలో చేరుతున్నట్లు కొత్తగా పార్టీలో చేరిన వారు వెల్లడించారు. సీసీ రోడ్డుకు శంకుస్థాపన అనంతరం చింతూరు గ్రామపంచాయతీ పరిధిలో సినిమా హాల్ సెంటర్ నుంచి వాడవజారు వరకు నిర్మించనున్న సీసీ రోడ్డుకు ఎమ్మెల్యే మిరియాల శిరీషా దేవి కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యం కల్పించేందుకు సీసీ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. టీడీపీ సమావేశం, భారీగా కుటుంబాల చేరికలు, అనంతరం సీసీ రోడ్డు శంకుస్థాపనతో చింతూరులో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.

## సెప్టెంబర్ 17న గుంటూరు కలెక్టరేట్ ముట్టడి

**చీకటి గోపి మృతిపై సీనియర్ ఐపీఎస్ అధికారితో సిట్ దర్యాప్తు చేయాలి**

**ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు మాచర్ల రూబేను మాదిగ**



మాచర్ల: ఆర్ సి ఇన్చార్జి సెప్టెంబర్ 16; నేటి శుభోదయ మాచర్ల: గుంటూరు జిల్లా తాడికొండ మండలం పొన్నెకల్లు గ్రామానికి చెందిన చీకటి గోపి మృతిపై నిష్పాక్షిక దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 17న గుంటూరు జిల్లా కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు మాచర్ల రూబేను మాదిగ తెలిపారు. ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. చీకటి గోపిని పోలీసులు విచారణ నిమిత్తం స్టేషన్‌కు తీసుకెళ్లిన అనంతరం అనారోగ్యానికి గురై గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సెప్టెంబర్ 1న మృతి చెందారు. గోపి మృతికి పోలీసుల వేధింపులే కారణమని కుటుంబ సభ్యులు, పలు దళిత సంఘాలు ఆరోపిస్తుండగా, పోలీసులు మాత్రం ఆ ఆరోపణలను ఖండించారు. ఘటనపై విచారణ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో గోపి మృతిపై ఉన్నతస్థాయి విచారణ జరిపించాలని, బాధ్యులుగా తేలిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మందకృష్ణ మాదిగ డిమాండ్ చేస్తున్నట్లు రూబేను మాదిగ తెలిపారు. సీనియర్ ఐపీఎస్ అధికారితో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలని, గోపి కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం అందించాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని ఆయన కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ కుల వివక్ష, అంటరానితనం, దళితుల పట్ల చిన్నచూపు వంటి సమస్యలు పూర్తిగా తొలగిపోలేదని రూబేను మాదిగ ఆవేదన వ్యక్తం చేశారు. దళితుల హక్కులు, ఆత్మగౌరవం కోసం సంఘటితంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. చీకటి గోపి మృతిపై తాడికొండ పోలీసులపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఈ నెల 17న గుంటూరు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు దళిత, గిరిజన, ప్రజాసంఘాల నాయకులు కూడా ప్రకటించినట్లు తాజా నివేదికలు వెల్లడిస్తున్నాయి.

## మాచర్ల మున్సిపాలిటీలో వార్డుల పునర్విభజన పూర్తి

**- 31 నుంచి 36 వార్డులకు పెంపు.. తుది గెజిట్ నోటిఫికేషన్ జారీ**




మాచర్ల సెప్టెంబర్ 16 రాజధాని వాయిస్ :ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం జారీ చేసిన +.ా.వీం.చీశీ.31. వీూడఖణ (జుశ్రీవఎ 1), తేది : 03-02-1995 మరియు +.ా.వీం.చీశీ.64, వీూడఖ×ణ (జుశ్రీవఎ-1), తేది : 24-03-2026 ద్వారా జారీ చేయబడిన ఆంధ్ర ప్రదేశ్ పురపాలక (నగర పంచాయతీలు మరియు పురపాలక సంఘాలను వార్డులుగా విభజించడం) రూల్స్ 1904లోని నిబంధనల ప్రకారం. మాచర్ల పురపాలక సంఘంలోని వార్డుల పునర్విభజన ప్రక్రియ చేపట్టబడింది. ప్రభుత్వ నిబంధనలు మరియు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మాచర్ల పురపాలక సంఘంలో ఉన్న 31 వార్డులను 36 వార్డులుగా పునర్విభజిస్తూ ప్రాధమిక నోటిఫికేషన్ నెం.646/2026/+1, తేదీ: 05.09 2026 ద్వారా ప్రచురించబడింది. ప్రాధమిక నోటిఫికేషన్ అనంతరం ప్రజల నుండి అభ్యంతరాలు, సలహాలు మరియు సూచనలు స్వీకరించే ప్రక్రియ చేపట్టబడింది. తదనంతరం 36 వార్డులతో గజిట్ నెం.557, తేది. 15-09-2026 న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము వారు గజిట్ పబ్లికేషన్ చేయుట జరిగినది.

## మోదీ జన్మదినాన్ని సేవా కార్యక్రమాలతో జరుపుకుందాం

**సెప్టెంబర్ 17న ప్రతి ఇంటా దీపాలు వెలిగించి ప్రధాని మోదీకి ఆశీర్వాదాలు అందిద్దాం**



మాచర్ల, సెప్టెంబర్ 16: ఆర్ సి ఇన్చార్జ్ ; నేటి శుభోదయ : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా సెప్టెంబర్ 17న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న వేడుకలను ప్రజా సేవా కార్యక్రమాలతో నిర్వహించాలని బీజేపీ మాచర్ల అసెంబ్లీ ఎస్సీర్ కన్వీనర్ గొబ్బూరి శ్రీనివాస్ నాయుడు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం మాచర్ల పట్టణంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ నాయుడు మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని కేవలం వేడుకగా కాకుండా ప్రజా సేవకు అంకితం చేసేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మోదీ ప్రజా జీవితంలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నెల రోజుల పాటు 'సేవా సంకల్ప అభియాన్' నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సెప్టెంబర్ 17న ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో దీపాలు వెలిగించి ప్రధాని నరేంద్ర మోదీ దీర్ఘాయుష్షు కోసం ప్రార్థించాలని ఆయన కోరారు. ప్రజా సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## అయ్యప్ప స్వామి పడిపూజ, భజన కార్యక్రమం వైభవోపేతం





యాడికి సెప్టెంబర్ 16 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక : మండల కేంద్రంలోని రాఘవేంద్ర కాలనీలో గల అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం పడిపూజ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీ అయ్యప్ప స్వామి వారి దివ్య అనుగ్రహం కోసం బుధవారం నాడు స్వామి వారి పడిపూజ మరియు భజన కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధల నడుమ వైభవంగా జరిగింది. శరణుఘోషలు, భక్తి కీర్తనలతో పూజా ప్రాంగణమంతా ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లింది. స్వామివారికి విశేష అభిషేకాలు, నక్షత్ర హారతులు మరియు పడిపూజ సేవలను కన్నులపండువగా నిర్వహించారు. ఈ పవిత్ర పడిపూజ మరియు భిక్షాదాన కార్యక్రమానికి పి. ఓబులరాజు మరియు వారి కుటుంబ సభ్యులు భిక్షాదాతలుగా వ్యవహరించారు. భక్తుల అయ్యప్ప నామస్మరణ మారుమోగుతుండగా సాగిన భజన కార్యక్రమం ఎంతగానో అలరించింది. పూజాధికాల అనంతరం విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం అందజేశారు. ఈ దివ్య మహోత్సవంలో విశేష సంఖ్యలో స్వామి భక్తులు పాల్గొని స్వామివారి కృపాకటాక్షాలు పొంది తరించారు.

## మాచర్లలో ఈనెల 21న నియోజకవర్గ స్థాయి ప్రజా దర్బార్

**పెండింగ్ సమస్యలపై అర్జీలు స్వీకరణ -- అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష**



మాచర్ల ఆర్ సి ఇన్చార్జి సెప్టెంబర్ 16; నేటి శుభోదయ మాచర్ల: నియోజకవర్గ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ఈనెల 21న సోమవారం నియోజకవర్గ స్థాయి ప్రజా దర్బార్ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా దర్బార్‌కు సంబంధించిన ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. నెహ్రూనగర్ బోటు వద్ద ఉన్న వీవీఎన్ గార్డెన్స్‌లో ప్రజా దర్బార్ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్లాతో పాటు వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన జిల్లా, నియోజకవర్గ స్థాయి ఉన్నతాధికారులు కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి సమస్యలను స్వీకరిస్తారని చెప్పారు. ప్రజా దర్బార్‌కు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ముఖ్యంగా పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ, మున్సిపల్ తదితర శాఖలకు సంబంధించిన సమస్యలను అర్జీల రూపంలో అందించి పరిష్కరించుకోవాలని ప్రజలకు సూచించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. సమావేశంలో మండల తహశీల్దార్ కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, హౌసింగ్ ఏఈ మరియదాసు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మీ గణేష్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో భారీగా అన్నవితరణ కార్యక్రమం పాల్గొన్న బొండా సిద్ధార్థ



విజయవాడ, సెప్టెంబర్ 16 (నేటి శుభోదయ):-64వ డివిజన్ లోని కండ్రికలో శ్రీ లక్ష్మీ గణేష్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో 8వ గణపతి మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాలలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు తనయుడు బొండా సిద్ధార్థ పాల్గొన్నారు. శ్రీలక్ష్మీ గణేష్ ఫ్రెండ్స్ సర్కిల్ నిర్వాహకులు కాకొల్లు రవికుమార్ , సభ్యులు సిద్ధార్థ కు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సిద్ధార్థ వినాయకుని కి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం సిద్ధార్థ మాట్లాడుతూ శ్రీ సిద్ధిబుద్ధి సమేత శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి చవితి నవరాత్రి ఉత్సవాలను శ్రీ లక్ష్మీగణేష్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆర్గనైజర్ కె.రవికుమార్ ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీ నుండి 23వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం వినాయకుని కి విశేష పూజలు నిర్వహిస్తారని తెలిపారు. వినాయకుడు విఘ్నాలను తొలగించి, విజయాలను ప్రసాదించే దేవుడని, ప్రతి శుభకార్యానికి గణనాథుడి పూజతో శ్రీకారం చుట్టడం మన సంస్కృతిలో ప్రత్యేకమైన సంప్రదాయమని అన్నారు. వినాయక చవితి పర్వదినం భక్తి, ఆధ్యాత్మికతతో పాటు ప్రజలందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చే ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. సెంట్రల్ లోని ఉత్సవ కమిటీలు, యువత, స్థానిక ప్రజలు ఎంతో భక్తిశ్రద్ధలతో కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. గణపతి నవరాత్రి ఉత్సవాలను అందరూ శాంతియుతంగా, భక్తిభావంతో, పరస్పర సహకారంతో నిర్వహించుకోవాలని కోరారు. గణపతి ఉత్సవాలు కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమాలు మాత్రమే కాకుండా ప్రజల మధ్య సోదరభావాన్ని, ఐక్యతను పెంపొందించే వేడుకలుగా నిలుస్తాయని అన్నారు. గణనాథుడి కృపతో సెంట్రల్ నియోజకవర్గంలోని ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, శాంతి సౌభాగ్యాలతో వర్ధిల్లాలని, ప్రజల జీవితాల్లో ఉన్న అన్ని విఘ్నాలు తొలగి అభివృద్ధి, విజయాలు చేకూరాలని శ్రీ వినాయకుడిని వేడుకున్నాను అని బొండా సిద్ధార్థ తెలిపారు. శ్రీ లక్ష్మీగణేష్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆర్గనైజర్ కె.రవికుమార్ అధ్వర్యంలో 8సంవత్సరాల నుండి చవితి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారని అన్నారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్నవితరణ కార్యక్రమాన్ని సిద్ధార్థ చేతుల మీదుగా ప్రారంభించారు. స్వామి వారి సేవకు శ్రీ లక్ష్మీ గణేష్ ఫ్రెండ్స్ సర్కిల్ కమిటీ సభ్యులు, అనేక మంది దాతలు, సహాయ సహకారాలు అందిస్తున్నారని శ్రీ లక్ష్మీ గణేష్ ఫ్రెండ్స్ సర్కిల్ నిర్వహకులు కె. రవికుమార్ తెలిపారు. సాయంత్రం 6:30 గం.లకు శ్రీ హరిహర అయ్యప్ప భక్త బృందం వారిచే భజన సంకీర్తన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్పస్వామి భక్తులు, స్థానిక భక్తులు, భక్త బృందం సభ్యులు, యావన్మమంది దీక్షాపరులు పెద్ద ఎత్తున విచ్చేసి తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అల్లు మహేష్, పొలిశెట్టి చంద్ర శేఖర్, పల్లెల రవి, అల్లు నరేంద్ర, తోట సత్యనారాయణ, తోట వెంకట ప్రసాద్, పట్టేం శెట్టి నాగమణి, ఇ. హరికృష్ణ రెడ్డి, స్థానిక భక్తులు తదితరులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మౌలిక సదుపాయాలు కల్పించాలి

**జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్**



అనంతపురం ,సెప్టెంబర్16 నేటి శుభోదయ : బుక్కరాయసముద్రం మండలపరిధిలోనికేంద్రీయ విశ్వవిద్యాలయం అభివృద్ధి లో భాగంగా పెండింగ్ లో ఉన్న పనులను సత్వరమే పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో జిల్లా జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్ తో కలిసి వివిధ శాఖ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ పనితీరుపై సంబంధిత విశ్వవిద్యాలయ ప్రతినిధులతో అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూయూనివర్సిటీలో ఇదివరకే చేపట్టిన పనులను పెండింగ్ లేకుండా పూర్తి చేయాలని ముఖ్యంగా జంతులూరు నుండి కొర్రపాడువైపు ఉన్న యూనివర్సిటీ ప్రహరీ గోడ నిర్మాణం త్వరితగతిన చేపట్టాలని ఆదేశించారు. అలాగే యూనివర్సిటీలోని పాత బోర్లనుమినహాయించి నూతనంగా జంతలూరు లో ప్రజల నూతనంగా 3 నీటి బోర్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకం ద్వారా కాంపౌండ్ వాల్ , మట్టిరోడ్డుపనులమంజూరు కు సంబంధించి ప్రతిపాదనలుసమర్పించాలనిఇంజనీరింగ్అధికారులను ఆదేశించారు .యూనివర్సిటీ భూమి వివరాలను సమర్పించాలని బుక్కరాయ సముద్రం తాసిల్దార్ కు జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ కివాడే, ప్రొ. హనుమాన్ కెనడి, బుక్కరాయసముద్రం తాసిల్దార్ శ్రీధర్ మూర్తి, పంచాయతీరాజ్ ఎస్. ఈ. సుబ్బరాయుడు,ఆర్డబ్ల్యూ ఎస్ .ఎస్. ఈ. శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహం పరిసరాల్లో అపరిశుభ్రతపై చర్యలు తీసుకోవాలి



మాచర్ల: ఆర్ సి ఇన్చార్జి సెప్టెంబర్ 16; నేటి శుభోదయ మాచర్ల: మాచర్ల పట్టణంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం సమీప పరిసరాల్లో కొందరు బహిరంగంగా మూత్ర విసర్జన చేస్తున్నారని, దీంతో ఆ ప్రాంతంలో అపరిశుభ్ర వాతావరణం నెలకొంటోందని దళిత బహుజన భీమ్ సేన రాష్ట్ర అధ్యక్షులు పేరుపోగు జార్జి ఆవేదన వ్యక్తం చేశారు. అంబేద్కర్ విగ్రహం చుట్టుపక్కల ప్రాంతంలో మిఠాయి బండ్లు నిర్వహించే వారు, చెప్పుల దుకాణాల వద్ద ఉండేవారు, మద్యం సేవించేందుకు వచ్చే కొందరు వ్యక్తులు, యాచకులు తదితరులు బహిరంగంగా మూత్ర విసర్జన చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఆయన తెలిపారు. దీంతో అంబేద్కర్ విగ్రహం పరిసరాల్లో దుర్వాసన, అపరిశుభ్రత ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. ప్రజల రాకపోకలు అధికంగా ఉండే ప్రాంతంలో ఇటువంటి పరిస్థితులు కొనసాగకుండా మున్సిపల్ అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. బహిరంగంగా మూత్ర విసర్జన చేసే వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు, అక్కడ పారిశుధ్య చర్యలు చేపట్టాలని, అవసరమైన చోట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.



**అంబేద్కర్ విగ్రహం పరిసరాలను పరిశుభ్రంగా, గౌరవప్రదంగా ఉంచేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని పేరుపోగు జార్జి కోరారు.**

## కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో 'ఆశీర్వాద దీపం' వేడుకలు..!

**- బిజెపి మండల అధ్యక్షులు అడపా సుధీర్ కుమార్ సారధ్యంలో ఘనంగా ప్రధాని మోడీ జన్మదిన సంబరాలు..!**



కోరుకొండ, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె)-;భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుట్టినరోజును పురస్కరించుకుని కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బిజెపి మండల అధ్యక్షుడు అడపా సుధీర్ ఆధ్వర్యంలో 'ఆశీర్వాద దీపం వెలిగిద్దాం' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా స్థానిక కొండ దిగున గల స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. సుధీర్ కుమార్ సారధ్యంలో వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఆయురారోగ్యాలతో సుదీర్ఘ కాలం దేశసేవలో కొనసాగాలని, దేశం మరింత పురోగతి సాధించాలని స్వామివారిని ప్రార్థిస్తూ దీపాలు వెలిగించారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు ఏ.పీ.ఆర్. చౌదరి, జిల్లా జాయింట్ సెక్రెటరీ మద్దిపాటి రజిని, బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యుడు తగరంపూడి గణపతి, జిల్లా ప్రచార కార్యదర్శి నరసింహమూర్తి,, సీనియర్ నాయకులు చొంగా సత్యనారాయణ, మండల ఓబీసీ అధ్యక్షుడు ఇల్లపు శివప్రసాద్, అడివి రాజు, మహిళా మోర్చా నాయకులు, తదితర బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు



## జగ్గంపేటలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో
## 'వెన్నుపోటు ప్రభుత్వం.. వెన్నుపోటు పాలనపై పోరు'



కాకినాడ జిల్లా,జగ్గంపేట, సెప్టెంబర్ 16 నేటి శుభోదయ : జగ్గంపేట నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో "వెన్నుపోటు ప్రభుత్వం.. వెన్నుపోటు పాలనపై పోరు" కార్యక్రమాన్ని బుధవారం జగ్గంపేటలోని సాయి బాలాజీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. పార్టీ నాయకులు, యువజన నాయకులు, మండల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి తోట నరసింహం మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను చంద్రబాబు నాయుడు ప్రభుత్వం నెరవేర్చకుండా కాలయాపన చేస్తోందని ఆరోపించారు. హామీల అమలుపై ప్రజల్లో ఆవేదన, అసంతృప్తి నెలకొన్నాయని పేర్కొన్నారు.ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని తోట నరసింహం విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. చంద్రబాబు నాయుడిపై గతంలో ఉన్న "వెన్నుపోటు" రాజకీయాల ప్రస్తావనను ప్రస్తావిస్తూ ఆయన విమర్శలు చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ శ్రేణులు ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వ విధానాలను వివరిస్తాయని తోట నరసింహం తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో సర్పంచ్ తదితర స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున అభ్యర్థులను బరిలోకి దింపుతామని చెప్పారు. పార్టీ శ్రేణులు ఐక్యంగా పనిచేసి ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యువజన నాయకులు తోట శ్రీరాంజి, ఓమ్మి రఘురాం, రావుల గణేష్ రాజా, కరుటూరి వీర్రాజు, చలగల దొరబాబు, గొల్ల ఏడుకొండలు, నియోజకవర్గ, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో
## టిడిపి, జనసేన, బిజెపి కూటమి విజయభేరి మోగించాలి

**గండేపల్లి మండల టిడిపి విస్తృత సమావేశంలో...**

**గండేపలిమండల టిడిపి అధ్యక్షులు పో తుల మోహనరావు**



కాకినాడ జిల్లా గండేపల్లి, సెప్టెంబర్ 16 నేటి శుభోదయ : గండేపల్లి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పోతుల మోహనరావు అధ్యక్షతన మండల స్థాయి విస్తృత సమావేశం గండేపల్లి మండల టిడిపి కార్యాలయంలో జరిగింది.సమావేశంలో మండల తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. పార్టీ కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై చర్చించి పలు కీలక తీర్మానాలు ఆమోదించారు.

**ఆమోదించిన తీర్మానాలు:** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో టిడిపి, జనసేన, బిజెపి కూటమి పార్టీలు విజయభేరి మోగించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని తీర్మానించారు. ముఖ్యంగా పింఛన్లు ఆన్లైన్లో అప్లికేషన్లు స్వీకరిస్తున్నారని అర్హులైన ప్రతి ఒక్కరు సచివాలయంలో నమోదు చేయించుకోవాలని అన్నారు. హౌసింగ్ లోన్లు, ఇళ్ల స్థలాల పంపిణీ వంటి సంక్షేమ కార్యక్రమాలను అర్హులకు తక్షణమే అందించాలి., ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతి గ్రామంలో ప్రజలకు వివరించాలి అని తీర్మానించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ ఆధ్వర్యంలో అభివృద్ధి సంక్షేమం అటు రాష్ట్రంలోనూ ఇటు నియోజకవర్గంలోనూ జోడెడ్ల బండిలా సాగుతున్నాయి. అమరావతి, పోలవరం, రోడ్లు, మౌలిక వసతులు, ఆర్థిక పెట్టుబడులు ఎలా అన్ని రకాలుగా రాష్ట్రం వేగవంతంగా అభివృద్ధి చెందుతుందని అని అన్నారు.ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ జాస్తి వసంత్, యూనిట్ ఇంచార్జ్ ఇప్పర్ల సురేష్,గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బొల్లంరెడ్డి రామకృష్ణ, గండేపల్లి మండల తెలుగుదేశంపార్టీ యువత అధ్యక్షులు సుంకవిల్లీ రమేష్, రామయ్యపాలెం గ్రామ తెలుగుదేశంపార్టీ అధ్యక్షుడు మైలవరపు శ్రీనివాస్, కంటిపూడి రామయ్య, వెంపాటి రాజు, ఆళ్ల సత్తిబాబు, పైల వెంకన్న చిటికెల కన్నబాబు ముంగర విష్ణుమూర్తి ఉండవిల్లి రాధాకృష్ణ, వెంపాటి రాంబాబు, మాచిన బాబురావు, నాలం వీరబాబు, దార కాటయ్య, గరిగిపాటి రమణ, గుర్రం శేఖర్, పైల రమణ, గునిపెల్లి వీరబాబు, పెనుగాడి నాగరాజు, యాక నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో
## ఘనంగా "ప్రపంచ ఓజోన్ పరిరక్షణ దినోత్సవ వేడుకలు

**(ఓజోన్ పొరను కాపాడితేనే జీవకోటికి మనుగడ)**




కాకినాడ జిల్లా, జగ్గంపేట సెప్టెంబర్ 16 నేటి శుభోదయ : జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ డా. డి. చెన్నారావు ఆధ్వర్యంలో, రసాయన శాస్త్ర విభాగం అధ్యాపకులు డా.జి. సత్యనారాయణ అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పి.ఆర్. ప్రభుత్వ కళాశాల (అటానమస్), కాకినాడలో సీనియర్ లెక్చరర్ గా పనిచేస్తున్న శ్రీ వి. మల్లికార్జున శర్మ ముఖ్య అతిథిగా విచ్చేశారు. కార్యక్రమంలో ముందుగా కళాశాల ప్రిన్సిపాల్ డా. డి. చెన్నారావు మాట్లాడుతూ ఓజోన్ పొర ప్రాముఖ్యతను, భూమిపై జీవరాశుల రక్షణలో ఓజోన్ పొర పోషించే కీలక పాత్రను వివరించారు. ఓజోన్ పొర క్షీణతకు కారణమయ్యే అంశాలపై అవగాహన కల్పిస్తూ, ఓజోన్ పొరను పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణ చర్యలను చేపట్టాలని సూచించారు. అనంతరం ముఖ్య అతిథి శ్రీ వి. మల్లికార్జున శర్మ గారు ఓజోన్ దినోత్సవం యొక్క ప్రాధాన్యతను, ఈ సంవత్సరం ఓజోన్ దినోత్సవం సందర్భంగా పాటించాల్సిన థీమ్ను వివరించారు. ఓజోన్ పొరను సంరక్షించడం ద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన మరియు సురక్షితమైన పర్యావరణాన్ని అందించవచ్చని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు చురుకైన పాత్ర పోషించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు ఓజోన్ పొర పరిరక్షణ, పర్యావరణ పరిరక్షణ మరియు వాతావరణ మార్పులపై తమ అభిప్రాయాలను ప్రసంగాల ద్వారా వ్యక్తం చేశారు. కార్యక్రమం ముగింపులో కళాశాల ప్రిన్సిపాల్ డా. డి. చెన్నారావు గారు విద్యార్థులు మరియు కళాశాల సిబ్బందితో "ప్రతి ఒక్కరూ తమ పుట్టినరోజు సందర్భంగా కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షిస్తాము" అనే ప్రతిజ్ఞ చేయించారు. మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడటంతో పాటు భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని ఆయన తెలిపారు. ఆనతరం కళాశాల ప్రాంగణంలో మొక్కలను నాటారు.కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీ సిహెచ్ బాలరాజు , ఐ. క్యూ.ఏ. సి కో-ఆర్డినేటర్ డా.పి .వి.వి. సత్యా నారాయణ , తెలుగు ఆధ్యాపకురాలు, డా. డి.సత్యలత , కామర్స్ ఆధ్యాపకులు, పి.పద్మ శేఖర్ , ఆంగ్ల ఆధ్యాపకులు వై. ఏ.ఎస్. శ్రీనివాస్, జువాలజీ ఆధ్యాపకులు పి.శ్రీనివాస రావు , హిస్టరీ ఆధ్యాపకులు ఆర్. శ్రీను, బోటాని అధ్యాపకురాలు వై.నవీన , కంప్యూటర్ అధ్యాపకులు వి. దేవి ప్రసన్న గణిత ఆధ్యాపకురాలు కే.టి. నాగ జ్యోతి , భౌతికశాస్త్ర అధ్యాపకులు పి.శేఖర్ ఇతర అధ్యపకేతర సిబ్బంది మరియు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.



## రేషన్ బియ్యం అక్రమ రవాణాపై విజిలెన్స్ మరియు పోలీస్ ఉక్కుపాదం

**కృష్ణవరం టోల్‌గేట్ వద్ద 96 క్వింటాళ్ల బియ్యం పట్టివేత**

**రెండు వాహనాలు సీజ్.. రూ.18.90 లక్షల విలువ**

**సమన్వయంతో తనిఖీలు.. 6ఏ కేసు నమోదు**



కాకినాడ జిల్లా,జగ్గంపేట సెప్టెంబరు 16 నేటి శుభోదయ : జగ్గంపేట నియోజకవర్గం కిర్లంపూడి మండలం కృష్ణవరం టోల్ గెట్ వద్ద రేషన్ బియ్యం అక్రమ రవాణాపై పోలీస్, విజిలెన్స్ అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టారు. కృష్ణవరం టోల్‌గేట్ వద్ద సోమవారం ఉదయం నిర్వహించిన తనిఖీల్లో రెండు వాహనాల్లో తరలిస్తున్న 96 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. అశోక్ లేలాండ్ బడా దోస్త్, బొలెరో వాహనాలను సీజ్ చేసి కిర్లంపూడి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై 6ఏ కేసు నమోదు చేసి తదుపరి చర్యలకు సివిల్ సప్లైస్ అధికారులకు సరుకును అప్పగించేందుకు చర్యలు చేపట్టారు.

### రూ.18.90 లక్షల విలువైన బియ్యం, వాహనాలు

రాజమండ్రి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం సోమవారం ఉదయం సుమారు 6 గంటల సమయంలో కృష్ణవరం టోల్‌గేట్ వద్ద తనిఖీలు నిర్వహించింది. ఈ సందర్భంగా అడ్డతీగల నుంచి జగ్గంపేటకు, ఎర్రవరం నుంచి జగ్గంపేట పరిధిలోని పౌల్ట్రీ ఫార్మ్‌లు, ఫిష్‌ఫార్మ్‌లు, బ్రిక్ వర్కర్లకు బియ్యాన్ని తరలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. పట్టుబడిన బియ్యం విలువ రూ.4.60 లక్షలు, వాహనాల విలువ రూ.14.30 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. మొత్తం రూ.18.90 లక్షల విలువైన బియ్యం, వాహనాలు సీజ్ చేసినట్లు వెల్లడించారు.

### కేసు నమోదు.. తదుపరి చర్యలకు రంగం సిద్ధం

అక్రమ రవాణాకు సంబంధించి 6ఏ కేసు నమోదు చేసిన అధికారులు, పట్టుబడిన బియ్యాన్ని సివిల్ సప్లైస్ అధికారులకు అప్పగించే ప్రక్రియ చేపట్టారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా వెనుక ఉన్న మూలాలను గుర్తించడం, సరుకు ఎక్కడి నుంచి సేకరించారు, ఎవరికి తరలిస్తున్నారు అనే అంశాలపై విచారణకు అవకాశం ఉంది. గతంలో ఇలాంటి కేసుల్లో పట్టుబడిన వాహనాలు తిరిగి అక్రమ రవాణాకు వినియోగించబడుతున్నాయా అనే అంశంపై కూడా సంబంధిత అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

### సమన్వయంతో తనిఖీలు

రాజమండ్రి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ అవినాష్, కిర్లంపూడి ఎస్సై జి. సతీష్‌కుమార్ , ఏవో శ్రీరామ్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కళాజ్యోతి, ఎంఎస్‌వో నాగబాబు, వీఆర్‌వో అచ్యుతరావు, వీర్రాజుతో పాటు తదితరులు తనిఖీల్లో పాల్గొన్నారు. పోలీస్, విజిలెన్స్ అధికారులు సమన్వయంతో నిర్వహించిన ఈ దాడుల్లో భారీగా రేషన్ బియ్యం పట్టుబడటంతో అక్రమ రవాణాపై అధికారులు చేపడుతున్న చర్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

## వైఎస్సార్ నగర్‌లో నూతన ఆర్‌వో ప్లాంట్ ప్రారంభం



నంద్యాల, సెప్టెంబర్ 16, నేటి శుభోదయ ::: నంద్యాల పట్టణం 38వ వార్డు పరిధిలోని వైఎస్సార్ నగర్ లో ప్రజల దాహార్తిని తీర్చేందుకు నంద్యాల ఎంపీ నిధులు రూ. 5 లక్షలతో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను బుధవారం నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ ఎం డి ఫిరోజ్ లు ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ ప్రజలకు స్వచ్ఛమైన సురక్షితమైన తాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ఎంపీ నిధుల నుంచి ఈ వాటర్ ప్లాంట్ ను శాక్షన్ చేపించడం జరిగిందని, వైఎస్సార్ నగర్ ప్రజల దీర్ఘకాలిక తాగునీటి సమస్యను దృష్టిలో ఉంచుకొని ఏర్పాటు చేశామని తెలిపారు. వార్డు ఇంచార్జి తాటికొండ బుగ్గరాముడు వైయస్సార్ నగర్ సమస్యల పట్ల త్వరితగతిన స్పందించడం ఎంతో అభినందనీయమని అన్నారు . ప్రజల సంక్షేమం, వార్డుల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు.టీడీపీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ ప్రజల కనీస అవసరాలు గుర్తించి వాటిని పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తోందని అన్నారు. వార్డు ప్రజల సంక్షేమం కోసం, వారి తాగునీటి కష్టాలను తీర్చాలనే సంకల్పంతో వార్డు ఇంచార్జి తాటికొండ బుగ్గరాముడు ఆధ్వర్యంలో నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి సహకారం తీసుకుని ఈ ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయం అన్నారు. నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి చొరవతో వైఎస్సార్ నగర్ ప్రజలకు స్వచ్ఛమైన మినరల్ వాటర్ అందుబాటులోకి రావడం సంతోషకరం అని . ?వార్డులో ఎలాంటి సమస్యలున్నా ఎల్లప్పుడూ ముందుండి పరిష్కరించే సమర్థవంతమైన నాయకత్వం తాటికొండ బుగ్గరాముడిదని . భవిష్యత్తులో కూడా వైఎస్సార్ నగర్, 38వ వార్డు పరిధిలో మౌలిక వసతుల కల్పనకు, కాలనీల సమగ్ర అభివృద్ధికి నాయకులందరం కలిసికట్టుగా అండగా ఉంటారని . ఈ మినరల్ వాటర్ ప్లాంట్ ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలి తెలిపారు .ఈ కార్యక్రమంలో మహేష్ బాబు, రసూల్ బాషా, మరాఠీ సూరి, బాబురావు, ప్రసాద్ రెడ్డి, సౌభాగ్యవతి, పద్మావతి, మేషక్, షబ్బీర్, గౌండ ఖలీల్, చందు, సలీం, పరమేష్, కార్తీక్, బబ్లు, గోవింద నాయుడు , జనసేన సురేష్, వార్డు నాయకులు, కార్యకర్తలు, కాలనీ ప్రజలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## రీ-సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

**అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి**



ఖమ్మం, సెప్టెంబరు 16, నేటి శుభోదయ ::: ప్రభుత్వం చేపడుతున్న రీ-సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించి, భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తెలిపారు. బుధవారం ముదిగొండ మండలం ఖానాపురం గ్రామంలో నిర్వహిస్తున్న భూ రీ సర్వే ప్రక్రియ ను అదనపు కలెక్టర్ పరిశీలించారు. రీ సర్వే మొత్తం ప్రక్రియ పూర్తిగా క్షేత్ర స్థాయిలో భూ హక్కుదారిని తో పాటు, సరిహద్దు రైతుల సమక్షంలో జరగాలని, రైతుల హక్కులకు ఎలాంటి నష్టం జరగకుండా ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతులు అపోహలకు గురికాకుండా అధికారులు అందించే సమాచారాన్ని నమ్మకంతో భూ రీ-సర్వే కార్యక్రమానికి పూర్తి సహకారం అందించాలని కోరారు.సర్వే అనంతరం గ్రామాల్లో భూ వివరాలను ప్రకటించి, వివరాలను గ్రామ పంచాయతీ, తహసీల్దారు కార్యాలయాలలో నోటీస్ బోర్డులో ఉంచుతామని, ఏలాంటి అభ్యంతరాలకు గడువు ఇస్తామని, అభ్యంతరాలు స్వీకరించి పరిష్కరించిన తర్వాత వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని పేర్కొన్నారు. రీ-సర్వే పూర్తయిన తర్వాత భవిష్యత్తులో భూ వివాదాలు గణనీయంగా తగ్గి రైతులకు శాశ్వత భద్రత కలుగుతుందని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ముదిగొండ తహసీల్దారు రవి కుమార్, అధికారులు, రైతులు, భూ యజమానులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా వేల మందికి
## అన్నదాన (అన్నప్రసాద వితరణ) కార్యక్రమం



జగ్గంపేట మండలం సెప్టెంబర్ 16 నేటి శుభోదయ: జగ్గంపేట మండలం గుర్రంపాలెం గ్రామం లో కృష్ణాష్టమి సందర్భంగా18వ శ్రీకృష్ణ జయంతి పురస్కరించుకొని యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణుని గుడి వద్ద భారీ అన్నప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది ఈ సందర్భంగా కమిటీ వారు తెలియజేస్తూ గత 18 సంవత్సరాలుగా యాదవ సంఘం ఆధ్వర్యంలో ప్రజలకు భారీ సంఖ్యలో అన్న ప్రసాద వితరణ జరుగుతుందని అన్నారు యాదవ సంఘం ఆధ్వర్యంలో కృష్ణుని గుడి దగ్గర జరిగే ఈ కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాలు నుండి భక్తులు,భారీ సంఖ్యలో వస్తారని అలాగే వచ్చిన వారికి కమిటీ ఆధ్వర్యంలో తగిన సౌకర్యాలు,జాగ్రత్తలు తీసుకుంటామని తెలియజేశారు అలాగే ప్రతి సంవత్సరము లాగ కమిటీ పెద్దలు పర్యవేక్షణలో యూత్ కూడా ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణుని జయంతి మొదటి రోజు నుండి చివరగా స్వామివారి అన్నదాన(అన్న ప్రసాద వితరణ) కార్యక్రమం జరిగేంతవరకు ఎంతో క్రమశిక్షణతో పెద్దలను గౌరవిస్తూ ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్లడం జరుగుతుందని యాదవ సంఘం కమిటీ పెద్దలు తెలియజేశారు శ్రీ స్వామి వివేకానంద స్కూల్ అధినేత ఒమ్మి రఘురాం మాట్లాడుతూ.. యాదవులు అంటే ఎటువంటి కల్మషం లేని వ్యక్తులని, తిరుపతిలో శ్రీ వెంకటేశ్వర స్వామి వారి మొదటి దర్శనం యాదవులకె కల్పించారని, అలాగే ఈ ఊర్లో యాదవులలో సర్పంచులు చేసిన వ్యక్తులు ఉన్నారని, యువత బాగా చదువుకోవాలని, గొప్ప గొప్ప ఉద్యోగ అవకాశాలు పొందాలని అయన కోరారు

## యాడికిలో వైభవంగా వినాయక నిమజ్జనోత్సవం

**: శోభాయాత్రలో మిన్నంటిన భక్తిపారవశ్యం**



యాడికి సెప్టెంబర్ 16 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక : మండల కేంద్రంలో గత ఐదు రోజులుగా పూజలందుకున్న విఘ్నేశ్వరుని నిమజ్జన కార్యక్రమం బుధవారం భక్తుల ఆనందోత్సాహాల మధ్య అత్యంత వైభవంగా ముగిసింది. ఊరంతా ఆధ్యాత్మిక శోభను సంతరించుకోగా, స్వామివారి వీడ్కోలు ఊరేగింపులో భక్తుల జయజయధ్వానాలు మిన్నంటాయి.

### మండపాల వద్ద భక్తిపారవశ్యం
### -- భజనల కోలాహలం

గత ఐదు రోజులుగా వినాయక చవితి సందర్భంగా యాడికిలోని వివిధ వీధుల్లో, కూడళ్లలో ఏర్పాటు చేసిన గణపతి మండపాలు విద్యుత్ దీపాలంకరణలతో దేదీప్యమానంగా వెలిగిపోయాయి. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం స్వామివారికి ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించారు. సాయంత్రం వేళల్లో భక్తులు, మహిళలు, యువకులు మండపాల వద్ద చేపట్టిన భజన కార్యక్రమాలు, కోలాటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిన్నారులు విఘ్నేశ్వరుని పాటలకు వేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.

### భారీ అన్నదాన కార్యక్రమాలు



ఆపదలను తొలగించే లంబోదరునికి ఐదు రోజుల పాటు వివిధ రకాల పిండివంటలు,

కుడుములు, ఉండ్రాళ్లు నైవేద్యంగా సమర్పించారు. గణేష్ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాలకు విశేష స్పందన లభించింది. వేలాది మంది భక్తులు ఎలాంటి వివక్ష లేకుండా స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించి తరించారు. దాతలు ముందుకు వచ్చి అన్నదానాలు ఏర్పాటు చేయడం ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత పెంపొందించింది.

### ముగిసిన శోభాయాత్ర

ఐదో రోజు సాయంత్రం గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి, శోభాయాత్రగా నిమజ్జన ప్రాంతానికి తరలించారు. ఈ యాత్రలో డప్పు వాయిద్యాలు, తీన్మార్ డాన్సులు, రంగులు చల్లుకుంటూ యువత చేసిన నృత్యాలు పండుగ వాతావరణాన్ని తలపించాయి. "గణపతి బప్పా మోరియా" అంటూ భక్తులు జైకొట్టారు. అనంతరం నీటి వనరుల వద్ద శాస్త్రోక్తంగా, సకల మర్యాదలతో బొజ్జ గణపయ్యను నిమజ్జనం చేశారు.

### పోలీసుల కట్టుదిట్టమైన బందోబస్తు

ఈ నిమజ్జన మహోత్సవం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా ముగిసేలా యాడికి సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ గోపాల్ మరియు పోలీసు సిబ్బంది కట్టుదిట్టమైన బందోబస్తు నిర్వహించారు. ఊరేగింపు సాగినంత దూరం ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. అధికారుల పర్యవేక్షణలో నిమజ్జన కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో పూర్తికావడంతో స్థానికులు, భక్తులు హర్షం వ్యక్తం చేశారు..

NETI SHUBHODAYA Publisher, Editor and Owned by GONGURA SRINIVASA RAO, D No : 41-29/6-76, RANIGARI THOTA, KRISHNALANKA, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520013. PRGI Reg No -"APTEL/26/A1193 .. Cell No - 9696571571 ..... Printed At SUNDAY PRINTING PRESS,"D No : 1-17-18, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006 .